నవతెలంగాణ
1
మెదక్
శుక్రవారం 07 ఫిబ్రవరి 2025 www.navatelangana.com

ప్యారా నగర్‌లో డంపింగ్ యార్డును వెంటనే నిలిపివేయాలి

ప్రజల పోరాటాలకు కేవీపీఎస్ సంపూర్ణ మద్దతు
ప్యారా నగర్‌ను మరో జవహార్ నగర్‌గా మార్చుతారా...!
కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మానిక్



నవతెలంగాణ-సంగారెడ్డి
ప్యారా నగర్‌లో జిహెచ్ఎంసి డంపింగ్ యార్డ్ నిర్మాణ పనులను వెంటనే నిలిపివేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మానిక్ డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డ్ రద్దు చేయాలని పోరాడుతున్న ప్రజలు చేస్తున్న పోరాటాలకు కేవీపీఎస్ సంపూర్ణ మద్దతునిస్తుందన్నారు. గుమ్మడిదల మండలం ప్యారా నగర్ గ్రామ పరిధిలో సర్వే నంబర్ 40, 41లో 151 ఎకరాల భూమిలో జిహెచ్ఎంసి డంపింగ్ యార్డ్ కోసం ప్రభుత్వం బలవంతంగా రైతుల నుంచి భూములు గుంజుకోవడం దారుణమన్నారు. రైతులు వరి, కూరగాయలు, పత్తి తదితర పంటలను పండించుకుని జీవితం గడుపుతున్నారన్నారు... పచ్చటి పంట పొలాలు నాశనం చేసి డంపు యార్డ్ నిర్మాణం చేపట్టడం దారుణమన్నారు ప్యారా నగర్ ను మరో జవహార్ నగర్ చేసే కుట్ర జరుగుతుందన్నారు జిహెచ్ఎంసి డంపు యార్డు నిర్మాణం వెంటనే నిలిపివేయాలని మాణిక్యం డిమాండ్ చేశారు.

ఎస్సీ వర్గీకరణను పారదర్శంగా అమలు చేయడం గర్వకారణం

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరి క్రితం ఎస్సీ సెల్ కన్వీనర్ అందే గంగ జమున



నవతెలంగాణ-మిరుదొడ్డి : ఎస్సీ వర్గీకరణ పారదర్శంగా అమలు చేయడం గర్వకారణం అని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరి ప్రీతం ఎస్సీ సెల్ కన్వీనర్ గంగజమున అన్నారు. గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి పుష్పగుచ్చం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు మూడు దశాబ్దాలకు పైగా పోరాటం చేస్తున్న నేతృత్వంలో జరుగుతున్న ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీలో అమలును శాస్త్రీయత కోణంలో ప్రవేశపెట్టారని తెలిపారు. తెలంగాణ అసెంబ్లీలో చట్టబద్ధత కల్పిస్తూ సుదీర్ఘ కాలం పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణ అంశాన్ని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా అమలు చేశారన్నారు. యావత్ మాదిగ జాతి కాంగ్రెస్ పార్టీకి రుణపడి ఉంటుందని, రేవంత్ రెడ్డి రెడ్డి, దామోదర్ రాజనర్సింహ కృషి మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రమోద్ , మహేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

చెల్కలపల్లి గ్రామాన్ని ముంపు గ్రామంగా గుర్తించాలి

-రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రికి లేఖ వ్రాసిన హరీశ్ రావు



నవతెలంగాణ-సిద్దిపేట
చిన్న కోడూరు మండలం చెల్కపల్లి గ్రామాన్ని ముంపు గ్రామంగా గుర్తించాలని, వారికి ప్రత్యేక పునరావస కేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్యాకేజ్ ఇవ్వాలని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి మాజీ మంత్రికి ఎమ్మెల్యే హరీశ్ రావు లేఖ వ్రాసారు. చిన్నకోడూర్ మండలంలోని చెల్కలపల్లి గ్రామ పరిధిలో చుట్టూ కాళేశ్వరంలో భాగంగా అన్నపూర్ణ (అంతగిరి) రిజర్వాయర్ నిర్మాణం చేపట్టారని, ఈ నిర్మాణంలో భాగంగా పక్కన ఉన్న కోచ్చగుట్టపల్లి గ్రామంలో 104 కుటుంబాలను నిర్వసితులుగా గుర్తించి ప్యాకేజ్, ఆర్అండ్ఆర్ కాలనీ నిర్మాణం చేపట్టామని, దీనికి తోడు 50 మీటర్ల దూరంలో చెల్కలపల్లి గ్రామం కూడా ఉంటుందని లేఖలో పేర్కొన్నారు. ఈ గ్రామంలో అప్పటి ఎఫ్ఆర్ఎల్‌లో రెండు ఇండ్లు నాలుగు కుటుంబాలు మాత్రమే ముంపునకు గురి కావడంతో ఆర్ అండ్ ఆర్ ప్యాకెజ్ ఇవ్వడం జరిగిందని మంత్రి ద్రుష్టి కి తెచ్చారు. ప్రస్తుతం అదనపు టీఎంసీ పంప్ హౌస్ పనుల్లో భాగంగా బ్లాస్టింగ్, డంప్ యార్డ్, గ్రామం మూడు వైపుల అన్నపూర్ణ రిజర్వాయర్ నీళ్లు ఉండటంతో ఇండ్లకు నీళ్లు చేరడం, డ్రైనేజ్ ఇండ్లలోకి రావడం, చుట్టూ ప్రక్కల డంప్ చేయడం, సరైన సెల్ సిగ్నల్స్ లెకపోవడం, ఉన్న ఒక్క రోడ్డు మార్గం ఈ పనుల్లో తీసేయడంతో రవాణా సౌకర్యం లేదని వివరించారు. ఈ లేఖ ద్వారా మీ ద్రుష్టి కి తెస్తున్నానన్నారు. కావున ఇట్టి అంశాలను పరిగణలోకి తీసుకోని చెల్కలపల్లి గ్రామాన్ని ముంపు గ్రామంగా గురించాలని విజ్ఞప్తి చేశారు. గత 17 రోజులుగా నిరాహార దీక్ష - ధర్నా చేస్తున్నారని వెంటనే ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. ఆర్ అండ్ ఆర్ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డికి ఫోన్ ద్వారా విషయాన్ని దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు.

సింగూరు ప్రాజెక్టును చూసేందుకు వచ్చి వ్యక్తి మృతి



నవతెలంగాణ-పుల్కల్
ఉమ్మడి మెదక్ జిల్లాలోని అతిపెద్ద ప్రాజెక్టు అయినా సింగూరు ప్రాజెక్టును చూసేందుకు వచ్చి ఒక వ్యక్తి మృతి చెందాడు పుల్కల్ ఎస్సై పాటిల్ క్రాంతి కుమార్ కథనం ప్రకారం వివరాలు ఈ విధంగా ఉన్నాయి సంగారెడ్డి పట్టణంలోని ప్రగతి నగర్‌కు చెందిన మొహమ్మద్ మౌలానా (60) తోటి స్నేహితులతో కలిసి గురువారం మధ్యాహ్నం సమయంలో సింగూరు ప్రాజెక్టును చూసేందుకు వచ్చారు. అనంతరం ప్రాజెక్టు దిగువ భాగంలో సరదా కోసం ఈత కొట్టడానికి నదిలోకి దిగారు. మౌలానాకు సరిగ్గా ఈత రాకపోవడంతో నీటిలో ఊపిరాడక నదిలోనే మునిగిపోయాడు. అది గమనించిన తోటి స్నేహితులు అక్కడున్న వారికి చెప్పడంతో వారు పుల్కల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న పుల్కల్ ఎస్సై పాటిల్ క్రాంతి కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని అక్కడున్న మత్స్యకారుల సహాయంతో మృతుని శవాన్ని బయటకి తీశారు. ఈ విషయాన్ని వారి కుటుంబ సభ్యులకు తెలపడంతో వారు ఒక్కసారిగా బోరున విలపించారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పుల్కల్ ఎస్సై పాటిల్ క్రాంతి కుమార్ అన్నారు

వీఆర్‌ఏల అక్రమ అరెస్టుకు నిరసనగా ఆందోళన



నవతెలంగాణ-సంగారెడ్డి
వీఆర్‌ఏల అక్రమ అరెస్టు, నిర్బంధించడాన్ని నిరసిస్తూ విఆర్ఎ జేఏసీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు సంగారెడ్డి కలెక్టరేట్ ముందు శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంగారెడ్డి అధ్యక్షులు రాజశేఖర్ మాట్లాడుతూ వీఆర్ఏలు 2022లో 80 రోజుల సుదీర్ఘ సమ్మె పోరాట ఫలితంగా గత ప్రభుత్వం జీవో నెంబరు 81, 85 లను విడుదల చేసిందని గుర్తు చేశారు. ఆ జీవోని అనుసరించి రాష్ట్రంలో ఉన్న 20,555 మంది వీఆర్ఏ ల్లో 16,758 మంది వీఆర్ఏలకు ప్రమోషన్స్ ఇచ్చి ఇతర శాఖల్లో సర్దుబాటు చేసిందన్నారు. ఆ జీవోలో ఉన్న 3797 మంది వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించి 19 నెలలు గడుస్తున్న నేటికీ వీఆర్ఏ వారసులకు ఉద్యోగాలు ఇవ్వకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తున్నదన్నారు. పలుమార్లు ముఖ్యమంత్రి రెవిన్యూ శాఖ మంత్రిని రెవెన్యూ అధికారులను కలిసి సమస్య విన్నవించినా, అనేక నిరసనలు తెలిపినా ప్రభుత్వం సానుకూలంగా స్పందించలేదన్నారు. దీంతో వీఆర్ఏ వారసులు శాంతియుతంగా రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి వీఆర్ఏల వారసుల గోడు తెలియజేయుటకు వస్తున్న వీఆర్ఏలను పోలీసులు అడ్డుకొని వారి చుట్టూ తాళ్లు పెట్టి నిర్బంధించారని మండిపడ్డారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు అవుతుందని, జీవో ఇచ్చి 19 నెలలు కావస్తుందన్నారు. ప్రభుత్వం విఆర్ఏల సమస్యల పరిష్కారం కోసం కమిటీని వేసి సంవత్సరం అవుతున్నా, ఇప్పటివరకు ప్రభుత్వం వీఆర్ఏ వారసులకు ఉద్యోగాలు ఇవ్వకుండా ఎందుకు నిర్లక్ష్యం చేస్తుందని ప్రశ్నించారు? వీఆర్ఏలను అడ్డుకొని దౌర్జన్యంగా అరెస్టులు చేసి నిర్బంధించడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రజా ప్రభుత్వం, ఇందిరమ్మ రాజ్యం అని గొప్పలు చెప్పే కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాలకు చెందిన ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాల వీఆర్ఏల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, జీవో నెంబర్ 81,85 ప్రకారం వారసులకి ఆర్డర్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అరెస్టు చేసిన విఆర్ఎలని వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జనార్ధన్, శంకర్, ఆంజనేయులు, ధనరాజ్, అశోక్, రాములు, చంద్రకాంత్, ఆంజనేయులు, సురేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-తూప్రాన్
తూప్రాన్ పట్టణంలో కుటుంబ కలహాలతో, తాగుడుకు బానిసై ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు తూప్రాన్ ఎస్సై జి.శివానందం తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని ఎస్సీ కాలనీకి చెందిన వడియారం మల్లేశం తన భార్య వడియారం జ్యోతితో గొడవపడి ఒంటరిగా తన స్వగృహంలోనే నివాసం ఉంటున్నాడు. భార్య జ్యోతి భర్తతో గొడవపడి పట్టణంలోనే వేరే ఇంట్లో కిరాయికి కుమారుడు బాబుతో నివాసం ఉంటున్నది. మృతుని భార్య దూరంగా ఉండటం వల్ల జీవితంపై విరక్తి చెంది తాగుడికి బానిసై ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఘటన స్థలానికి వెళ్లి శవాన్ని పరిశీలించినట్లు తెలిపారు. మృతుని భార్య వడియారం జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జి.శివానందం తెలిపారు.

పల్లెల్లో.. స్థానిక ఎన్నికల హడావిడి



- ఎంపీటీసీ, జెడ్పీటీసీకే ముందు...
- తర్వాతే పంచాయతీ ఎన్నికలు
- ఓటరు జాబితాలు సిద్ధం చేసిన యంత్రాంగం
- బీసీలకు 41 శాతం రిజర్వేషన్లు...ఆశావహుల్లో టెన్షన్

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి
పల్లెల్లో స్థానిక సంస్థల ఎన్నికల అదావుడి పెరిగింది. నాలుగు కొత్త పథకాల అమలు తర్వాత ఎన్నికలకు వెళ్తామని ప్రభుత్వ పెద్దలు ప్రకటనలు చేస్తుండడంతో గ్రామాల్లోనూ ఆ సందడి కనిపిస్తుంది. ముందు సర్పంచ్ ఎన్నికలా..? ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలొస్తాయా..? అనేది కూడా చర్చనీయాంశంగా మారింది. అధికారులు మాత్రం ఏ ఎన్నికలొచ్చినా నిర్వహించేందుకు సిద్ధం చేస్తున్నారు. ఇటీవల ఎంపీటీసీ స్థానాల ఖరారు, ఓటర్ల జాబితాలు పైనలు చేస్తుండడంతో ముందుగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలే వస్తాయంటున్నారు. బీసీ కుల గణన పూర్తవ్వడంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించనున్నందున ఆశావహుల్లో ఊగిసలాట మొదలైంది. జనరల్ వస్తే పోటీ చేయాలనుకున్న వాళ్లంతా ఇప్పుడు బీసీ లెక్కలపై కన్నేశారు. ఎస్సీల్లోనూ మాదిక ఉపకులాలకు 9, మాల ఉపకులాలకు 5 శాతం కేటాయించినందున ఎస్సీ రిజర్వుడ్ స్థానాల్లోనూ ఆ ప్రాంతిపాదికన స్థానాలు కేటాయించనున్నారు.

జిల్లా	ఎంపీటీసీ	జెడ్పీటీసీ	ఎంపీపీ	ఓటర్లు
సిద్దిపేట	230	26	26	977924
మెదక్	190	21	21	525478
సంగారెడ్డి	276	27	27	851420
మొత్తం	696	74	74	2354822

696 ఎంపీటీసీ, 74 జెడ్పీటీసీలకు ఎన్నికలు

స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ప్రభుత్వం ముందస్తుగా మండల, జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలకు ఎన్నికలు జరిపే అవకాశముంది. సర్పంచ్ ఎన్నికల కంటే పార్టీ గుర్తులపై జరిగే జెడ్పీటీసీ, ఎంపీటీసీకు వెళ్లడం ద్వారా ప్రభుత్వానికి అనుకూలంగా ఫలితాలు వచ్చే అవకాశముందని అంచనా వేస్తున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో 2019లో జరిగిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో ఉన్న స్థానాల్లో మార్పులు జరిగాయి. కొత్తగా మండలాలు ఏర్పడడం, గ్రామాలు మున్సిపాలిటీల్లో, జీహెచ్ఎంసీలో కలవడంతో ఎంపీటీసీ స్థానాల సంఖ్యలోనూ మార్పులొచ్చాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో 696 ఎంపీటీసీ స్థానాలు, 74 జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలున్నాయి. జిల్లాల వారిగా సిద్దిపేట జిల్లాలో 230 మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు (ఎంపీటీసీ), 26 జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు (జెడ్పీటీసీ) స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. మెదక్ జిల్లాలో 190 ఎంపీటీసీ, 21 జెడ్పీటీసీ, ఎంపీపీ పదవులు, సంగారెడ్డి జిల్లాలో 276 ఎంపీటీసీ, 27 జెడ్పీటీసీ, ఎంపీపీ పదవులున్నాయి. సంగారెడ్డి జిల్లాలో గత ఎన్నికల్లో 295 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఇటీవల పటాన్‌చెరులో 9, గుమ్మడిదలలో 5, జిన్నారంలో 3, కంగ్టిలో 1, కోహీర్‌లో 3 ఎంపీటీసీ స్థానాలు తగ్గాయి. అమీన్‌పూర్‌లో మాత్రం 2 స్థానాలుపెరిగాయి. నిజాంపేట, చౌటకూర్ మండలాలేర్పడంతో జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలు పెరిగాయి.

2354822 మంది ఓటర్లు

ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 23 లక్షలా 54 వేలా 822 మంది ఓటర్లున్నారు. సిద్దిపేట జిల్లాలో 977924 మంది ఓటర్లుండగా 478452 మంది మహిళలు, 499390 మంది పురుషలున్నారు. మెదక్ జిల్లాలో 525478 మంది ఓటర్లుండగా వీరిలో 272672 మంది మహిళలు, 252797 మంది పురుషులు, ఇతరులు 9మంది ఉన్నారు. సంగారెడ్డి జిల్లాలో 851420 మంది ఓటర్లుండగా వీరిలో 423062 మంది మహిళలు, 427739 మంది పురుషులు, 52 మంది ఇతరులున్నారు. వీరంతా కూడా స్థానిక సంస్థల్లో ఓటర్లుగా ఉన్నారు. ఇప్పటికే ఓటర్లు జాబితాలు సిద్ధం అయ్యాయి.

రిజర్వేషన్లతో టెన్షన్

కొత్తగా స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు పెరగడం, మార్పుల చేయడం జరిగింది. కొత్తగా బీసీ కుల గణన పూర్తవ్వడంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అదే విధంగా ఎస్సీల కోటా 15ను కూడా ఉప కులాల వారిగా విభజించారు. మాదిక ఉప కులాలకు 9 శాతం, మాల ఉపకులాలకు 5 శాతం, సంచార కులాలకు ఒక్క శాతం చొప్పున రిజర్వేషన్లు విభజించారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో ఈ రిజర్వేషన్లు అమలవుతాయి. ఇప్పటికే జనరల్ వస్తే పోటీ చేయాలని ఆశపడుతున్న ఓసీ నాయకులు బీసీ రిజర్వేషన్ల పెంపు వల్ల టెన్షన్ పడుతున్నారు. బీసీలకు సీట్ల సంఖ్య పెరగడంతో మండలంలో కనీసం ఐదు నుంచి పది ఎంపీటీసీ స్థానాలున్నాయి. వీటిల్లో 42 శాతం బీసీలకు ఇవ్వాల్సి వస్తే జనరల్ స్థానాలు తగ్గుతాయంటున్నారు. బీసీ జనాభా లెక్కలు తేలినందున ఏఏ గ్రామాల్లో బీసీలకు రిజర్వుడ్ చేయబడతాయో లెక్కలేస్తున్నారు. బీసీ నాయకుల్లేని చోట ఏదో ఒక బీసీ కులం నుంచి లీడర్లను వెతుకుతున్నారు. ఎస్సీల్లోనూ మాదిగలకు 9 శాతం, మాలలకు 5 శాతం ఇవ్వాల్సి ఉన్నందున కేటాయించిన స్థానాల్లో ఎవరున్నారనే లెక్కలు కూడా వేస్తున్నారు.

డంపింగ్ యార్డు రద్దయ్యే వరకు ఉద్యమం

- మరో లగచర్లను చేయొద్దు
- పారానగర్ భూముల సర్వే చేయాలి
- అటవీ అధికారుల ద్వంద నీతి
- నిర్బంధానికి జంకేదిలే:ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి





నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి
పారానగర్‌లో ఏర్పాటు చేయనున్న డంపింగ్ యార్డ్‌ను వెంటనే రద్దు చేయాలని, అప్పటి వరకు ప్రజలు ఉద్యమిస్తునే ఉంటారని, ప్రభుత్వం జోక్యం చేసుకుని వెంటనే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో మరో లగచర్ల అవుద్దని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి హెచ్చరించారు. గురువారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డీఆర్ఓ పద్మజారాణికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే చింత ప్రభాకర్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో సునీతాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ పారానగర్‌లోని పంట పొలాల మధ్య 152 ఎకరాల్లో జీహెచ్ఎంసీ చెత్త డంపింగ్ యార్డ్‌ను పెట్టేందుకు రాత్రికి రాత్రి పనులు చేయడం అప్రజాస్వామికమన్నారు. పారానగర్ భూముల్ని సర్వే చేయాలని హైకోర్టు చెప్పినా పట్టించుకోలేదన్నారు. కోర్టు స్టేటస్ కో ఇచ్చినప్పటికీ జీహెచ్ఎంసీ అధికారులు పారానగర్ భూముల్లో పనులు ఎలా చేస్తున్నారని ప్రశ్నించారు. కోర్టును సైతం లెక్క చేయని దుస్థితి ఉందన్నారు. గుమ్మడిదల, నల్లవల్లి, పారానగర్‌తో పాటు మరో పది గ్రామాల వరకు చెత్త డంపింగ్‌యార్డ్ వల్ల కాలుష్య కోరల్లో చిక్కుకుంటాయని ఆవేదన వ్యక్తం చేశారు. నర్సాపూర్ చెర్వులోకి వ్యర్థపు నీరు చేరి వెయ్యి ఎకరాల ఆయకట్టులో పండే పంటలన్నీ కలుషితమవుతాయన్నారు. పారానగర్‌కు వెళ్లేందుకు బీటీ రోడ్డు వేసేందుకు తమ ప్రభుత్వంలో నిధులు మంజూరు చేశామని, రోడ్డు కోసం అటవీ అధికారుల్ని అనుమతులు కోరితే నిరాకరించడం వల్ల రోడ్డు వేయలేకపోయామని తెలిపారు. డంపింగ్ యార్డ్ కోసం మాత్రం చెట్లను నరికి రోడ్డు వేయడానికి అటవీ అధికారులు ఎలా అనుమతులిచ్చారని ప్రశ్నించారు. దుండిగల్ ఎయిర్‌పోర్ట్ సమీపంలోనే ఉన్నందున డంపింగ్ యార్డులో చేరే పక్షులు, ఇతర జీవరాసుల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశముందన్నారు. పారానగర్‌లో డంపింగ్‌యార్డు కాకుండా అర్బన్ పారెస్ట్ లేదంటే పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని సూచించారు. కనీసం కంపెనీలు పెట్టినా స్థానికులకు ఉపాధి లభిస్తుందన్నారు. డంపింగ్ యార్డు వల్ల 15 గ్రామాల వరకు రాబోయే కాలంలో నివాసముండలేని దుస్థితి ఏర్పడుతుందన్నారు. పోలీసులు నిర్బంధం ప్రయోగించి రైతుల్ని స్టేషన్‌లో పెట్టడం సరికాదన్నారు. జీహెచ్ఎంసీ అధికారులు అత్యుత్సాహం చూపుతూ స్థానికుల్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. డంపింగ్ యార్డ్ ను రద్దు చేసే వరకు బీఆర్ఎస్ పోరాడుతుందన్నారు. ఈ సమావేశంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్, నాయకులు దేవేందర్, మాజీ సీడీసీ చైర్మన్ కాసర్ల బుచ్చిరెడ్డి, ఆదర్శ నగర్ కార్పొరేటర్ బాల్‌రెడ్డి, గోవర్ధన్, వెంకటేష్, ప్రభాకర్, రైతులు వేణుగోపాల్, శ్రీనివాస్, నర్సింహులు, మీనయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

అడవి ప్రాంతంలో డంపింగ్ యార్డ్ నిర్మాణం చేపట్టొద్దు

- నర్సాపూర్‌లో బంద్ రాస్తారోకో
- పాల్గొన్న ఎమ్మెల్యే సునీత రెడ్డి, అఖిలపక్ష పార్టీల నాయకులు



నవతెలంగాణ-నర్సాపూర్
నర్సాపూర్ అటవీ ప్రాంతమైన ప్యారా నగర్ సమీపంలో డంపింగ్ యార్డ్ నిర్మాణం చేపట్టొద్దంటూ డిమాండ్ చేస్తూ గురువారం అఖిలపక్ష పార్టీల నాయకులు నర్సాపూర్‌లో బందు చేపట్టారు. అనంతరం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా రాస్తారోక్ కార్యక్రమం చేపట్టారు. ఈ రాస్తారోకోతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయి ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఆందోళనకారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినా ఆందోళనకారులు వినకుండా రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత రెడ్డి మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా నల్లవల్లి సమీపంలోని ప్యారా నగర్ గ్రామ సమీపంలో డంపింగ్ యార్డ్ నిర్మించి, హైదరాబాదులో సేకరించిన చెత్తాచెదారం వ్యర్థాలు ఇక్కడికి తీసుకువచ్చి పారబోయడం వల్ల ఇక్కడి గ్రామాలు దుర్వాసనతో ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉందన్నారు. పచ్చని గ్రామాలు, అడవి చెత్తగా మారే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా ఈ డంపింగ్ యార్డ్ వల్ల నర్సాపూర్ రాయరావు చెరువులోని నీరు కలుషితం అయ్యే అవకాశం ఉందని ఆమె మండిపడ్డారు. వెంటనే డంపింగ్ యార్డ్ నిర్మాణం విరమించుకోవాలని లేకుంటే అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు మల్లేష్ గౌడ్, సిపిఐ జిల్లా కార్యదర్శి కాలేక్, నర్సాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ అశోక్ గౌడ్, నాయకులు సత్యం గౌడ్, పంబళ్ల బిక్షపతి, నాగరాజు, రామచందర్, ఆంజనేయులు గౌడ్, గోడ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్యారా నగర్‌లో డంపింగ్ యార్డు పనులు నిలిపివేయాలి

- తగ్గేదే లేదంటున్న అఖిలపక్షం నేతలు
- అంబేద్కర్. గాంధీజీ విగ్రహాలకు వినతి పత్రాలు
- పోలీసుల పహరాల్లో నల్లవల్లి,కొత్తపల్లి,గుమ్మడిదల,ప్యారా నగర్





నవతెలంగాణ-గుమ్మడిదల
మండలంలోని నల్లవల్లి పంచాయితీ ప్యారనగర్‌లో చేపడుతున్న డంపింగ్ యార్డ్ పనులను వెంటనే నిలిపివేయాలని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డు పనులను నిరసిస్తూ మండలంలోని ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, వ్యాపార వాణ్య సముదాయాల యజమానులు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. గుమ్మడిదల మండలం బిఆర్ఎస్, బిజెపి శ్రేణులు అఖిలపక్షంగా ఏర్పడి డంపింగ్ యార్డును అడ్డుకోవడంలో ఏ మాత్రం తగ్గేది లేదని స్పష్టం చేస్తున్నారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ గాంధీజీ విగ్రహాలకు వినతి పత్రం అందజేసి నిరసన వ్యక్తం చేశారు. కొత్తపల్లి, నల్లవల్లి, మంబాపూర్, గుమ్మడిదల యువకులు టవర్లు వాటర్ ట్యాంక్‌లు ఎక్కి నిరసన వ్యక్తం చేశారు వెంటనే ప్యారనగర్‌లో డంపింగ్ యార్డ్ పనులు నిలిపివేయాలని, పచ్చటి పొలాల్లో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చెయ్యోదని, రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

పచ్చని వాతావరణాన్ని కలుషితం చేస్తున్నారు

ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి
ఈ సందర్భంగా నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ... ప్రజా పాలన పేరుతో పచ్చని వాతావరణాన్ని డంపింగ్ యార్డ్ పేరుతో కలుషితం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కంకణం కట్టుకుందన్నారు. పచ్చని పల్లెల్లో చిచ్చు పెట్టి రేపటి భవిష్యత్తు తరానికి మార్గం లేకుండా చేస్తున్నారని బిఆర్ఎస్, బిజెపి, నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి రాష్ట్ర నాయకులు వెంకటేష్ గౌడ్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి మాజీ జడ్పిటిసి కుమార్ గౌడ్ సింధు ఆదర్శ రెడ్డి కోలన్ బాల్ రెడ్డి బిజెపి మండల అధ్యక్షుడు కావలి ఐలేష్ నర్సంపల్లి రాజిరెడ్డి పలుగు గోవర్ధన్ రెడ్డి టిపిసిసి అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి విజయ్ కుమార్ శ్రీనివాస్ ముదిరాజ్ దోమడు శంకర్ యువకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

10న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

నవతెలంగాణ-సంగారెడ్డి
జిల్లాలో నిర్వహించే ఈ నెల 10వ తేదిన నిర్వహించే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమాన్ని వైద్య ఆరోగ్య శాఖతో పాటు సంబంధిత శాఖలన్ని సమిష్టిగా పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ క్రాంతి వల్లూరు కోరారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం ఐడీఓసీలోని మినీ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ వంద శాతం పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. .జిల్లాలో 4,05,207 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు ఇవ్వాలనే లక్ష్యంగా అధికారులు కార్యాచరణ రూపొందించాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, సంక్షేమ హాస్టళ్లలో డివార్మింగ్ ట్యాబ్లెట్ అల్బెండెజాలె పంపిణీ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆల్బెండజోల్ మాత్రలు1-19 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరికీ వేయాలన్నారు. తెల్లాపూర్ , అమీనాపూర్, జి హెచ్ ఎం సి లాంటి అర్బన్ ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. వలసదారుల పిల్లలు, అనాథ పిల్లలు ఉన్న ప్రాంతాలు, శిబిరాలు, తక్కువ పారిశుద్ధ్య పరిస్థితుల్లో జీవించే సమూహాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. చివరి విడతగా ఫిబ్రవరి 17న మిగిలిన వారికి మాత్రలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారుణి డా.గాయత్రీ, జెడ్పీ సీఈఓ జానకిరెడ్డి, డి పి ఓ సాయిబాబా, బి సి సంక్షేమాధికారి జగదీశ్, డీఈఓ వెంకటేశ్వర్లు, సంబంధిత శాఖల అధికారులు, వివిధ ఎన్ జి ఓ ల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



బీసీ కులగణన చారిత్రాత్మకం

- మాటల్లో కాదు చేతల్లో చూపిన నాయకుడు రేవంత్ రెడ్డి
- తెలంగాణలో పెరగనున్న బీసీల రాజకీయ అవకాశాలు
- ముఖ్యమంత్రిని కలిసి ధన్యవాదాలు తెలిపిన నీలం మధు ముదిరాజ్



నవతెలంగాణ-పటాన్‌చెరు
దేశంలో ఎక్కడ లేని విధంగా జనాభా ప్రాతిపదికన బీసీ వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించే దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేసిన బీసీ కులగణన చారిత్రాత్మకమని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. గురువారం హైదరాబాద్ జుబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో నీలం మధు సీఎంను కలిసి పుష్పగుచ్ఛం అందించి తెలంగాణలోని బీసీల పక్షాన ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ దశాబ్దాలుగా బీసీలలో రాజకీయ చైతన్యం ఉన్నా రాజకీయ ప్రాతినిధ్యం అవకాశం లేక చాలామంది బీసీలు నాయకులుగా ఎదగలేకపోయారని కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఒక బృహత్ సంకల్పంతో కులగణనను చేపట్టి దేశానికి ఆదర్శంగా నిలిచిందని గుర్తు చేశారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బీసీ వర్గాలకు కులగణన పట్ల ఇచ్చిన హామీని తెలంగాణ ప్రజా ప్రభుత్వం నిలబెట్టుకుందన్నారు. ప్రజలకు సంక్షేమం అభివృద్ధి సామాజిక న్యాయం మాటల్లో కాదు చేతల్లో చూపిస్తున్న దమ్మున్న నాయకుడు రేవంత్ రెడ్డి అని కొనియాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న ఈ చారిత్రాత్మక నిర్ణయంతో రానున్న రోజుల్లో బీసీ బిడ్డలంతా రాజకీయంగా ఎదగడానికి అవకాశాలు లభిస్తాయని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం పెంచే దిశగా అసెంబ్లీలో నిర్ణయం తీసుకోవడం పట్ల కాంగ్రెస్ పార్టీకి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రాష్ట్ర మంత్రులు అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సామాజిక న్యాయం దిశగా అడుగులు వేస్తూ బీసీలకు రాజకీయ అవకాశాలు కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వానికి తెలంగాణ బీసీలమంతా రుణపడి ఉంటామన్నారు.

మాదిగలపై కపట ప్రేమ చూపిస్తున్న మంత్రి దామోదర్

- జిల్లా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కాశపాగ ఇమ్మయ్య



నవతెలంగాణ-పుల్కల్

మాదిగలపై కపట ప్రేమ చూపిస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ తన పదవికి రాజీనామా చేయాలని జిల్లా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కాశపాగ ఇమ్మయ్య డిమాండ్ చేశారు. స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మాదిగ, మాదిగ ఉపకులాల శ్రేయస్సు కోసం ముప్పై సంవత్సరాల సుదీర్ఘ పోరాటం చేసిన మంద కృష్ణ మాదిగకు మాదిగ జాతి మొత్తం రుణపడి ఉంటుందన్నారు. మంద కృష్ణ మాదిగ లక్షల డప్పులు వేల గొంతుల కార్యక్రమన్ని రూపొందిస్తే, ఆ స్పందనను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఏబీసీడీ వర్గీకరణ అంశంని లేవనెత్తి మాదిగలకు 9% మాలలకు 5% తో ప్రకటన చేసిందన్నారు. ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజానర్సింహా రిజర్వేషన్లపై ఎందుకు మాట్లాడం లేదని ప్రశ్నించారు. 15 లక్షలు ఉన్న మాలలకు 5% ఇస్తున్నప్పుడు 32 లక్షల పై చిలుకూగా ఉన్న మాదిగలకు 11% పైననే రావాల్సిన వాట 9% ప్రకటించినా ఎందుకు స్పందించడం లేదన్నారు. కేవలం రాజకీయలలో రిజర్వేషన్ కోసం వాడుకోవడానికి మాత్రమేనన్నారు. ఈ కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ నాయకులు ఎర్రోళ్ల పొచ్చాయ్య పాల్గొన్నారు

జోగిపేటలో బైక్ ర్యాలీ



నవతెలంగాణ-జోగిపేట

మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బేటి బచావో బేటి బచావోలో భాగంగా గురువారం పురపాలక సంఘ కార్యాలయం నుంచి స్థానిక బసవేశ్వర విగ్రహం గుండా క్లాక్ టవర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖా అధికారిని పల్లవి, ఆర్‌డీఓ పాండులు మాట్లాడుతూ బాలికల సంరక్షణ ప్రతి ఒక్కరికి బాధ్యత అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల అభ్యున్నతి ఎంతో కృషి చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విష్ణు సాగర్, మునిసిపల్ కమిషనర్ సి. హెచ్.తిరుపతి, మున్సిపల్ సానిటరీ ఇన్స్ పెక్టర్ వినయ్ సిబ్బంది పాల్గొన్నారు.

అర్జున్ టీవియస్ షోరూంను ప్రారంభించిన హరీశ్‌రావు



నవతెలంగాణ- రామచంద్రాపురం

మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు రామచంద్రాపురంలోని అర్జున్ టివిఎస్ షోరూంను ప్రారంభించారు. ప్రజలకు అవసరమయ్యే వాహనాలను నూతన షోరూం యాజమాన్యం అందించాలని ఈ సందర్భంగా హరీష్ రావు కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆదర్శ రెడ్డి, పటాన్చెరువు కార్పొరేటర్ మెట్టు కుమార్, రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, టీవియస్ మోటార్ కంపెనీ జనరల్ మేనేజర్ కెంద్రాజ్ జోషి, విశాల్ విక్రమ్‌సింగ్, వరుణ్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలుకు పితృవియోగం

నవతెలంగాణ-నారాయణఖేడ్ రూరల్

నారాయణఖేడ్ పట్టణంలో మన్సల్పూర్‌లో టీఎస్ యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలుకు పితృవియోగం కలిగింది. ఈ విషయం తెలుసుకున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్కా రాములు, సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి జయరాజు, రాష్ట్ర కమిటీ సభ్యులు అడివయ్య, కార్యదర్శివర్గ సభ్యులు అతి మేల మాణిక్యం, మల్లేశం, రాజయ్య, సాయిలు వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి రమేష్ కాన్షిరాం అరుణ్ సిఐటియు జిల్లా నాయకులు భాగారెడ్డి ప్రసన్న మైపాల్ తదితరులు పాల్గొన్నారు..

మల్లికార్జున స్వామి జాతరకు సర్వం సిద్ధం

నవతెలంగాణ-ఐడిఎ బొల్లారం: బొల్లారం మున్సిపల్ మల్లన్న బస్తీలోని మల్లన్న స్వామి జాతర ఉత్సవాలకు సర్వం సిద్ధం చేసినట్లు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, మాజీ కౌన్సిలర్ చంద్రారెడ్డి గురువారం తెలిపారు. ప్రతి ఏటా స్వామి వారి జాతర ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. శుక్రవారం మైలపోలు కార్యక్రమం, 8న గంగపటం, 9న మల్లికార్జున స్వామి కళ్యాణోత్సవం, అన్నదానం, 10న నాగవెల్లి కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జాతర ఉత్సవాలను జయప్రదం చేయాలని చంద్రారెడ్డి విజ్ఞప్తి చేశారు.

గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అంజిరెడ్డిని గెలిపించాలి

బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి



నవతెలంగాణ-జోగిపేట

ఉమ్మడి నిజామా బాద్, కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డిని గెలిపించాలని, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి సూచించారు. గురువారం జోగిపేట పట్టణంలో వివిధ డిగ్రీ కాలేజీలు, ప్రవేట్ పాఠశాలల్లో డిగ్రీ పొందిన టీచర్స్, స్టాఫ్‌ను కలిసి ఓట్లు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు వెంకట నరసింహారెడ్డి, పోచారం రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి కోల్యూరు రాజశేఖర్ రెడ్డి, కృష్ణమూర్తి జిల్లా ఉపాధ్యక్షులు ప్రభాకర్ గౌడ్, అందోల్ అసెంబ్లీ కన్వీనర్ మఠం చంద్రశేఖర్, భూమయ్య మండల అధ్యక్షులు శివ చందర్, జోగిపేట పట్టణ అధ్యక్షులు శివశంకర్, ఆంజనేయులు, పాపయ్య, రాజు, సుజిత్, రవి, సంగమేష్, బీజేవైఎం నాయకులు నరేన్ , దేశ్ పాండే అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

గంగోజిపేటను సందర్శించిన ఎంపీడీవో



నవతెలంగాణ-చౌటకూర్

మండలంలో స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా గంగోజీపేట గ్రామాన్ని గురువారం ఎంపీడీవో రామలింగం సందర్శించారు.గ్రామంలో త్రాగునీటి సమస్యల నివారణకు తగు సూచనలు చేశారు. మిషన్ భగీరథ పైపుల లికేజ్ లేకుండా చూసుకోవాలన్నారు. అదేవిధంగా గ్రామంలోని నర్సరీని పరిశీలించారు. ఎండలు అధికంగా ఉన్నందున మొక్కలకు ప్రతిరోజు నీరు పట్టాలన్నారు. అక్కడి నుంచి ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు మంచి భోజనాన్ని అందించాలని, ప్రతిరోజు రిజిస్టర్ లో అటెండెన్స్ తప్పనిసరిగా వేయాలని టీచర్‌లకు సూచించారు. ఈ కార్యక్రమములో ఎంపీవో శ్రీకాంత్, ఏఈ నాగసాయి, పంచాయతీ కార్యదర్శి మంజుల, గ్రామస్తులు పాల్గొన్నారు


పారదర్శకంగా లబ్ధిదారులను గుర్తించాలి



నవతెలంగాణ-న్యాల్‌కల్

ప్రభుత్వం ప్రభుత్వ యంత్రాంగం జిల్లా అధికారుల ఆదేశాలతో .. న్యాల్ కల్ ఇందిరమ్మ ఇండ్ల పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక అయింది. ఈ మేరకు ఇందిరమ్మ హౌస్ పిడి చలపతిరావు స్థానిక కాంగ్రెస్ నాయకులు సొసైటీ చైర్మన్ సిద్ధి లింగయ్య స్వామి మండల పంచాయతీ రాజ్ అధికారులు కలిసి స్థలాన్ని పరిశీలించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో నిరుపేదలైన లబ్ధిదారులు అనువైన స్థలం ఉందా లేదా అని పరిశీలించారు. మొదటగా పేదలను అరులైన వారిని గుర్తించి ప్రాధాన్యత ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని మండల పంచాయతీరాజ్ అధికారులకు హౌసింగ్ పిడి ఆదేశించారు. త్వరలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను ప్రారంభించాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజశేఖర్, ఏపిఎం ధనరాజ్ , స్థానిక నాయకులు సొసైటీ చైర్మన్ సిద్ధి లింగయ్య స్వామి, సత్యనారాయణ, స్థానిక సెక్రటరీ ధనరాజ్, భీమ్ రావు, సరీన్ , ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులున్నారు ..


భవాని మాత జాతరను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-న్యాల్ కల్ : రత్నాపూర్ గ్రామంలో 11వ తేదీ వరకు జరిగే భవాని మాత ఆలయ జాతర మహోత్సవాలును విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. ఆలయ పరిసర ప్రాంతాలలో విద్యుత్ దీపాలతో అలంకరణ, మల్లికార్జున్ శాస్త్రి ప్రవచనాలతో జాతర ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. 11వ తేదీ కుంభమేళా పల్లకి ఊరేగింపు పురవీధుల గుండా, రాత్రి దేవి పురాణం, జాతర ఉత్సవాలు కొనసాగుతున్నట్లు తెలిపారు. 11వ తేదీన బర్దిపూర్ బసవలింగ బిచ్కుంద మహరాజ్ జాతరకు విచ్చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా జాతర ఉత్సవాలకు ఎంపీ సురేష్ షెట్కార్ హాజరుకానున్నట్లు ఉత్సవ కమిటీ గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు శాంత్ కుమార్ పాటిల్, రాజ్ కుమార్, ధనరాజ్, రమేష్ పాటిల్ , బసవరాజ్, పూజారి వీరయ్య స్వామి, తదితరులు ఉన్నారు.

రోడ్లపై మోకాల్లోతు గుంతలు

- తరచూ రోడ్డు ప్రమాదాల గురవుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు పాలకులు







నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ నియోజకవర్గంలోని పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి శాఖలకు సంబంధించిన రోడ్లు కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు సంభవించి అనేక మంది క్షతగాత్రులుగా మారుతున్నారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాడు తెలంగాణ రాష్ట్ర అవతరణ అనంతరం నాటి ప్రభుత్వం మండల కేంద్రం నుంచి నియోజకవర్గానికి డబుల్ రోడ్డును నిర్మించేందుకు చేపట్టిన చర్యల్లో భాగంగా అప్పట్లో రోడ్లు మరమ్మత్తులకు నోచుకున్నాయి నూతన రోడ్లు ఏర్పడ్డాయి. ఆ రోడ్లకు అనుసంధానంగా ఉన్న రోడ్లను కనీసం ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నేడు రోడ్డు ప్రమాదాలు సంభవించి క్షతగాత్రులు లేని గ్రామం అంటూ లేదని చెప్పడంలో అతిశయోక్తి లేదు. గత ప్రభుత్వ హాయంలో నియోజకవర్గంలోని ప్రతి మండలంలో గ్రామంలో రోడ్లకు నిధులు మంజూరయ్యాయి, టెండర్లు సైతం పిలిచారు. పలు పలులు ప్రారంభమై నిధులు రాకపోవడంతో అర్ధాంతంగా నిలిచిపోయాయి. ప్రభుత్వం మారిన అనంతరం రోడ్లు మరమ్మత్తులు అవుతాయని జహీరాబాద్ నియోజకవర్గ ప్రజలు ఆశించారు. ఒక సంవత్సరం పూర్తయినప్పటికీ ఈ ప్రభుత్వ హాయాంలో కనీసం ఒక్క రోడ్డు కూడా మరమ్మతు చేయకపోవడంతో ప్రజలు విస్మయం వ్యక్తం చెందుతున్నారు. ఇప్పటికే అల్గోల్ గ్రామానికి చెందిన ప్రజలు వాహన చోదకులు రోడ్లపై బైఠాయించి నిరసన తెలియజేసిన అంశం తెలిసిందే. వారికి సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి మీ రోడ్డు మంజూరు అయ్యింది త్వరలోనే పనులు ప్రారంభిస్తామని ప్రకటించి కూడా సంవత్సరం దగ్గరికి వస్తున్నప్పటికీ నేటికీ రోడ్డు పనులు ప్రారంభం కాకపోవడంతో ఆ గ్రామ ప్రజలు మరోసారి ఆందోళనకు సిద్ధమవుతున్నారు. జహీరాబాద్ పట్టణంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు సాగడంతో అటు నుంచి వెళ్లేటటువంటి వాహనాలన్నింటిని అల్లానా పరిశ్రమ బైపాస్ రోడ్డు నుంచి అధికారులు మళ్లించారు. ఆ రోడ్డుపై మహేంద్ర స్టార్ సిటీ వద్ద మోకాల లోతు గుంతలు ఏర్పడడంతో తరచుగా వాహనాలు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఈ విషయమై ఆర్ అండ్ బి అధికారులు కనీసం పట్టించుకున్న దాఖలాలు కూడా లేవు. జహీరాబాద్ నుంచి శకాపూర్ వెళ్లే రోడ్డు కూడా పూర్తిగా ధ్వంసం అవడంతో జాతర సమయంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ మంత్రి డాక్టర్ ఏ చంద్రశేఖర్ రోడ్డును మరమ్మతులు చేస్తామని హడావిడి చేసి ఉన్న రోడ్డును సైతం నాశనం చేశాడని ఆ గ్రామానికి చెందిన ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రోడ్డుపై మరమ్మత్తులు చేపట్టకపోవడంతో తమ ఇళ్లల్లోకి దుకాణాల్లోకి తరచూ దుమ్ము రావడంతో కనీసం ఇంట్లో కూర్చోలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తూముకుంట రోడ్డుపై మోతాదుకు మించిన బరువుతో వాహనాలు నడపడంతో గ్రామంలోని ఇళ్లలోకి మొత్తం దుమ్ము, ధూలి వస్తుందని రోడ్డును మరమ్మతు చేయాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని తూముకుంట గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మంజూరైన రోడ్ల పనులను ప్రారంభించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

చిక్కరు దొరకరు ఆర్ అండ్ బి అధికారులు

ఆర్ అండ్ బి అధికారులు చిక్కరు దొరకరు అనే విధంగా వారి వ్యవహారంగా మారింది నియోజకవర్గంలోని ప్రజలు తమ సమస్యలు తీసుకొని ఆర్ అండ్ బి కార్యాలయానికి వస్తే కార్యాలయంలో అటెండర్ తప్ప సిబ్బంది ఎవరు ఉండడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డిప్యూటీ శ్రీనివాస్ ఆర్ అండ్ బి ఏఈలు తమ ఫోన్‌లు ఎత్తడం లేదని ప్రజాప్రతినిధులు మాజీ ప్రజాప్రతినియులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బదిలీ అయినా ఇక్కడే విధులు

జహీరాబాద్ ఏఈగా పనిచేసిన సంధ్యారాణి బదిలీ అయి నెలలు గడుస్తున్నా ఆమె స్థానంలో ఇతర అధికారి వచ్చినప్పటికీ ఇక్కడే ఉండి పాత తేదీల్లో ఎంబిలు, రికార్డు చేస్తూ ఇక్కడి నుంచి పోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. సదరు ఏఈ బాధ్యతలు అప్పజెప్పకపోవడంతో నూతనంగా బాధ్యత చేపట్టినటువంటి ఏఈ సైతం పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

ఇది ప్రభుత్వ వైఫల్యం



రోడ్లు మరమ్మత్తు చేయాలి. వర్షాకాలం నుంచి ఇప్పటివరకు పలు దఫాలుగా వివిధ శాఖల అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ పట్టించుకోవడంలేదు. ఇది ప్రభుత్వ వైఫల్యమే. రోడ్డు సక్రమంగా లేకపోవడంతో ప్రజలు, ప్రయాణికులు క్షతగాత్రులుగా మారుతున్నారు.

బి.రాంచందర్ , సీపీఎం ఏరియా కార్యదర్శి

అధికారులు దొరకడం లేదు



శేకాపూర్ గ్రామానికి చెందిన రోడ్డు మరమ్మతులు చేయాలి. తరచు రోడ్డు ప్రమాదాలు జరుగుతు న్నాయి. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదు. చివరికి ఫోన్లు కూడా లేపడం లేదు.

నర్సింహులు, శేకాపూర్ గ్రామస్తుడు

రోడ్డు కోసం మరో ఉద్యమం తప్పదా



అల్గోల్ రోడ్డు నిర్మించాలని ఇప్పటికి రెడు దఫాలుగా ఉద్యమాలు చేపట్టినాము. అప్పుడు వచ్చి హామీలు ఇచ్చినటువంటి అధికారులు పట్టించుకోకపోవడం హేయమైన చర్య, రోడ్డు కోసం మరో సారి ఉద్యమం చేయాల్సి వస్తుందేమో.

అనిల్‌కుమార్, అల్గోల్ గ్రామం

బీసీలకు అన్యాయం జరిగితే సహించేది లేదు

- ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ వై.నరోత్తం



నవతెలంగాణ-జహీరాబాద్

ఈ ప్రభుత్వం బీసీల పట్ల కక్షగట్టి వారిపై మొసలి కన్నీరు కారుస్తుందని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ వై నరోత్తం అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ 2014లో బీఆర్ఎస్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే చేసి రాష్ట్రంలో 3కోట్ల 60 లక్షల జనాభా ఉన్నట్లు గుర్తించి అందులో 51 శాతం బీసీలున్నారని ధృవికరించారన్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ నివేదికను ప్రక్కన పెట్టి ఇటీవల డిసెంబర్ 2024లో కులగణన చేసి 3.54 కోట్ల ప్రజలు సర్వేలో పాల్గొన్నారని,16 లక్షల మంది పాల్గొనలేదని చూపారు. మొత్తం కలిపినా 3.70 కోట్ల మంది అందులో బీసీలు 46.25శాతం అని అన్నారు. అంటే ఇది గతంలో కంటే 4.75 శాతం తగ్గించారు. అదేవిదంగా అంత ర్జాతీయంగా, జాతీయంగా 10 సంవత్సరాలలో సగటున 13.5శాతం జనాభా పెరుగుతుందని అంచనా అ లెక్కన ఇప్పుడు జనాభా 4 కోట్ల పైనే ఉండాలి. కానీ ఇప్పుడు 33 శాతం పెరిగినట్లు చూపించడం జరిగింది. ఈ లెక్కలు తప్పుల తడకగా కనిపిస్తున్నాయన్నారు. ఇది పూర్తిగా బీసీలను వంచిచడమేనన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు తన మ్యానిపిస్టోలో కామారెడ్డి బీసీ డిక్లరేషన్ పేరిట కులగణన బీసీ కమీషన్ నివేదిక ఆధారంగా అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోపే బీసీల రిజర్వేషన్లు పెంపు చేస్తామన్నారు. కానీ బీసీల ఓట్లను దండుకిని అధికారంలోకి వచ్చి సర్వే పేరిట ఎస్సీ ఎస్టీ బీసీల జనాభా తగ్గినట్లు కేవలం ఓసీల జనాభా పెరిగినట్లు అన్ని వర్గాల జనాభా తగ్గినట్లు కేవలం ఒక వర్గం జనాభా ఎలా పెరుగుతుందన్నారు. ఈ విధంగా వారి జనాభాను తగ్గించి చూపించడం చూస్తే బీసీల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎంత ప్రేమ ఉన్నదో అర్థం అవుతుందన్నారు. బీసీలలో ఉన్న ప్రతి కులం జనాభా ఎంతో లెక్కలతో సహా వివరంగా బయట పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి.నర్సింలు, బి.విఠల్, ధర్ము పవార్, తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక వాడలో మత్స్యకారుల్ని ప్రత్యేకంగా పరిగణించాలి

- సొసైటీ సభ్యత్వాలు, పథకాల లబ్ధి కోల్పోతున్న మత్స్యకారులు
- పాశమైలారం పరిశ్రమల కాలుష్యం వల్ల విషపూరితంగా మారుతున్న ఇస్నాపూర్ చెరువులు
- జీవనోపాధి కోల్పో తున్న మత్స్యకారులు
- ప్రతి ఒక్కరికీ సొసైటీ సభ్యత్వాలు కల్పించాలి
- మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకెళ్లిన నీలం మధు ముదిరాజ్
- కొడకంచి ఆదినారాయణ స్వామి జాతర, ఇస్నాపూర్ పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలకు రావాలని ఆహ్వానం



నవతెలంగాణ-పటాన్ చెరు

పటాన్ చెరు మండలం పాశమైలారం పారిశ్రామికవాడలోని ఇస్నాపూర్ గ్రామ మత్స్యకారులను ప్రత్యేకంగా పరిగణించాలని మంత్రి కొండా సురేఖను మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ కోరారు. గురువారం ఇస్నాపూర్ మున్సిపల్ మత్స్యకార సోదరులతో కలిసి తెలంగాణ రాష్ట్ర దేవాదాయ, ఎన్విరాన్మెంట్ శాఖ మంత్రి, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్చార్జ్ మంత్రి కొండా సురేఖను హైదరాబాద్‌లోని వారి నివాసంలో కలిసి మత్స్యకారుల సమస్యపై వినతి పత్రం అందజేశారు. అనంతరం ఈ నెల 8వ తేదీన జిన్నారం మండలం కోడకంచి ఆదినారాయణ స్వామి జాతర, 21వ తేదీన ఇస్నాపూర్ పెద్దమ్మతల్లి విగ్రహప్రతిష్ఠ కార్యక్రమాలకు హాజరుకావాలని ఆహ్వానించారు. అనంతరం నీలం మధు మాట్లాడుతూ పాశమైలారం పారిశ్రామిక వాడలో వెలువడుతున్న కాలుష్యం కారణంగా ఈ ప్రాంతంలో చెరువులు విషపూరితంగా మారాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమల నుంచి వస్తున్న వ్యర్థ జలాలు చెరువులో కలవడం వల్ల ఇప్పటికే ఈ ప్రాంతంలో చాలా చెరువులలో చేప పిల్లలు మృత్యువాత పడుతున్నాయన్నారు. ఏఏ పరిశ్రమల ద్వారా చెరువులకు నష్టం జరుగుతుందన్న విషయాన్ని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ద్వారా విచారణ జరిపి నిగ్గు తేల్చాలని విజ్ఞప్తి చేశారు. కొన్ని చెరువుల్లో కాలుష్యం వల్ల చేపల పెంపకానికి అనువుగా లేకపోవడంతో ఇక్కడ మత్స్యకార సభ్యులకు సొసైటీలో సభ్యత్వం కల్పించే విషయంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆయన వాపోయారు. దీంతో ఇక్కడ మత్స్యకారులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన పథకాలలో అర్హత సాధించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాశమైలారం పారిశ్రామికవాడలో నెలకొన్న ఈ పరిస్థితుల నేపథ్యంలో ఇస్నాపూర్ మత్స్యకారులను ప్రత్యేకంగా గుర్తించి జిల్లా మత్స్యకార సహకార సంఘంలో సభ్యులుగా చేర్చుకోవాలని, పరిశ్రమల నుంచి ప్రతి సంవత్సరం నష్ట పరిహారం ఇప్పించాలని ఆయన మంత్రిని కోరారు. ఈ విషయంలో సానుకూలంగా స్పందించిన మంత్రి కొండా సురేఖ పీసీబీ అధికారులకు విచారణ జరిపి నివేదిక ఇవ్వవలసిందిగా ఆదేశాలిచ్చారు, పారిశ్రామిక వాడలోనీ మత్స్యకారులకు న్యాయం జరిగే విధంగా శాశ్వత పరిష్కారం దిశగా నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో జిన్నారం బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ దాసరి శ్రీకాంత్ రెడ్డి, జిన్నారం, గుమ్మడిదల మండల అధ్యక్షులు వడ్డే కృష్ణ, నర్సింగ్ రావు, ప్రతాప్ రెడ్డి,మాణిక్ రావు, నారబోయిన శ్రీనివాస్, వీర్నాల సత్యనారాయణ, సుంకర బోయిన మహేష్,కొడకంచి ఆలయ అర్చకులు, ఇస్నాపూర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు మన్నే రాఘవేందర్,ఉళ్ళ శంకర్, ప్యాట నర్సింలు,యాదగిరి, పెంటయ్య, గోపాల్,రాజు, సోములు, మనోహర్, దశరథ్,రవి తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఒప్పందంతో స్మశాన వాటికకు దారి

నవతెలంగాణ-కొండాపూర్ : స్మశానవాటికకు దారి లేక శతాబ్దాల కాలంగా ఇబ్బందులు ఎదుర్కొన్న గ్రామస్తులకు సమస్యకు ఎట్టకేలకు గురువారం తెరపడింది. కొండాపూర్ మండలం మారేపల్లిలో గ్రామంలో వెనుకబడిన తరగతుల వారి స్మశానవాటికకు వెళ్లడానికి దారి లేక శతాబ్దాల కాలంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్మశానవాటికకు పార్థివదేహాలను తీసుకెళ్లడానికి దారి కోసం స్థలం ఇవ్వాలని పరిసరాల రైతులు పి.సత్యనారాయణరెడ్డి, పి.ప్రతాప్‌రెడ్డి, పి.శ్రీనివాస్‌రెడ్డి, పి.రాంరెడ్డిలను గ్రామస్తులు చాలా కాలంగా కోరుతూ వచ్చారు. ఎట్టకేలకు రైతులు అంగీకరించడంతో గ్రామస్తులు గురువారం స్మశానవాటికకు వెళ్లడానికి దారి నిర్మాణం పనులు చేపట్టారు. దారి ఏర్పాటుకు స్థలం ఇచ్చిన రైతులకు గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు. చాలా కాలం తరువాత స్మశానవాటికకు దారి ఏర్పాటు కావడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



కారస్‌గుత్తిలో భేటీ బచావో భేటీ పడవో



నవతెలంగాణ-మనూర్

నాగల్గిద్దా మండలంలోని కారస్‌గుత్తి ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. జిల్లా శిశు సంక్షేమ అభివృద్ధి అధికారి నర్సిములు డా జావేరియా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ అంగన్వాడీ కేంద్రం నుంచి ఆసుపత్రి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డా విక్టరీ రాణి, అంగన్వాడీ టీచర్లు ఆశవార్కులు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో పేరుకపోతున్న పారిశుధ్యం

- ప్రత్యేక అధికారుల పాలనలో అస్తవ్యస్తం
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



నవతెలంగాణ-పుల్కల్ : గ్రామాల్లో సర్పంచ్ల పాలన ముగియడంతో ఆ స్థానాల్లో ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించిన విషయం విధితమే. అయితే గ్రామాలపై వారి పర్యవేక్షణ కొరవడ ంతో.. పారిశుధ్యం మొత్తం అస్తవ్యస్తగా తయారైంది. మురుగునీరు రోడ్లపైనే ఏరులై పారుతున్నది. ఆ మురికి కాలువలను శుభ్రపరచడంలో ప్రత్యేక అధికారులు పూర్తిగా విఫలం అయ్యారని ఆరోపణలు గుప్పుమంటున్నాయి. మురికి కాలువలు నిండి.. దోమల బెడద కూడా పెరుగుతు న్నది. తద్వారా ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురవుతు న్నారు. ఈ విషయాన్ని పలుమార్లు సంబంధిత అధికారు లకు ఫిర్యాదు చేసినా.. ఏ ఒక్క అధికారి స్పందించట్లేదని గ్రామ స్తులు వాపోతున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే ఆరోగ్యాలు పాడైపోయే ప్రమాదం ఉన్నదని ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రా మాల్లో నెలకొన్న పారిశుధ్యాన్ని తొలగించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నా రు.

చేనేత పొదుపు పథకం వరం లాంటిది

చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు వెంకటరావు



నవతెలంగాణ-జోగిపేట

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన చేనేత పొదుపు పథకం కార్మికులకు వరం లాంటిదని చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు వెంకట రావు అన్నారు. గురువారం స్థానిక చేనేత సహకార సంఘం కార్యాలయంలో అధ్యక్షులు వర్కల అశోక్ అధ్యక్షతన చేనేత కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికుల జీవితాలలో వెలుగులు నింపేందుకు సీఎం రేవంత్ రెడ్డి అభయ హస్తం, నేతన్న పొదుపు, నేతన్న భద్రత, భరోసా వంటి పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారన్నారు. కార్మికులు ఈ పథకాలలో చేరేందుకు ముందుకు రావాలన్నారు. పథకాలకు సంబంధించిన మార్గదర్శకాలను కార్మికులకు వివరించారు. అనంతరం కార్మికులకు జియో ట్యాగ్ నెంబర్లు ఇవ్వాలని చేనేత సహకార సంఘం చైర్మెన్ వర్కల అశోక్ వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఉన్ని సహకార సంఘం చైర్మెన్ కృష్ణయ్య, జౌళి శాఖ అధికారి లలిత, సంఘం సభ్యులు రాజేందర్, కార్మికులు పాల్గొన్నారు.

రథ సప్తమి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం



నవతెలంగాణ-జహీరాబాద్

రథ సప్తమి సందర్భంగా జహీరాబాద్ పట్టణంలోని రుపాలి ప్రకాష్ దేవగిరి నివాసంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. గురువారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించి సత్కరించారు.అనంతరం, పాల్గొన్న వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రూప దేవగిరి, సాక్షి దేవగిరి, నితాదేవసలే, కోమల్, స్వప్న, రేష్మలక్కీ తదితరులు పాల్గొన్నారు. ప్రతి సంవత్సరం వివిధ రంగాల్లో ప్రతిభ కనపరిచిన మహిళలకు సత్కరించేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని నిర్వాహకులు తెలిపారు.

నవతెలంగాణ
మెదక్
3
శుక్రవారం 07 ఫిబ్రవరి 2025 www.navatelangana.com

స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తు చేసుకోండి

- నర్సాపూర్ సీడీపీఓ హేమభార్గవి



నవతెలంగాణ-శివ్వంపేట

గ్రామాలలో స్వయం ఉపాధి కోసం దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ నర్సాపూర్ సెక్టార్ సీడీపీఓ హేమభార్గవి, శివ్వంపేట సూపర్ వైసర్ సంతోష తెలిపారు. మహిళా, శిశు సంక్షేమం, దివ్యాంగులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వం నుంచి జిల్లాలోని అర్హులైన దివ్యాంగులకు ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున అందించేందుకు 25 యూనిట్లు మంజూరు అయినట్లు సీడీపీఓ తెలిపారు. యూనిట్ల మంజూరుకు అర్హులైన ఈ నెల 12వ తేదీ లోపు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకుని, సంబంధిత ధ్రువపత్రాలను స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సమర్పించాలని ఆమె తెలిపారు. స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తు చేసుకునే దరఖాస్తుదారులు ఆదాయ ధ్రువపత్రం సమర్పించాల్సి ఉంటుందని, ఒకవేళ ఆదాయ ధ్రువపత్రం లేని యెడల రేషన్ కార్డు ద్వారా కూడ దరఖాస్తు చేసుకోవచ్చునని, ఏవైనా సందేహాలుంటే వాటిని నివృత్తి చేసుకోవడానికి ఐసీడీఎస్ కార్యక్రమంలో గాని అంగన్వాడీ కేంద్రాలలో సంప్రదించాలని ఆమె తెలిపారు. ఈ సదావకాశాన్ని దివ్యాంగులందరు సద్వినియోగం చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

- జిల్లా విద్యాధికారి రాధా కృష్ణ



నవతెలంగాణ -వెల్దుర్తి

పరీక్షలు సమీపిస్తుండడంతో అధైర్య పడకుండా ఇష్టంతో కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని జిల్లా విద్యాధికారి రాధాకృష్ణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని హై స్కూల్, కస్తూర్బా పాఠశాలలో చదివే విద్యార్థులతో సమావేశమై మాట్లాడారు. పదవ తరగతి ఇంటర్మీడియట్ పరీక్షలు దగ్గర ఉండడంతో శ్రద్ధగా స్పెషల్ క్లాస్‌తోపాటు ఇంటి వద్ద ఎక్కువ సమయం చదువుకోడానికి కేటాయించాలి అన్నారు. సెల్ ఫోన్లు, టీవీలకు దూరంగా ఉండాలన్నారు. సమయాన్ని వృధా చేయకుండా పట్టుదలతో చదివి పాఠశాల పేరు తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చే విధంగా మంచి మార్కులతో పాసై ఉన్నత చదువులు చదువుకోవాలని సూచించారు. ఈయన వెంట మండల విద్యాధికారి యాదగిరి ఉపాధ్యాయులు విద్యార్థులు ఉన్నారు.

కార్మిక శ్రేయస్సుయే సీఐటీయూ లక్ష్యం

- ఇండస్ మెడికేర్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె మల్లికార్జున్.



నవతెలంగాణ-మనోహరబాద్

కార్మికుల శ్రేయస్సు సిఐటియు లక్ష్యమని కార్మికుల సంక్షేమం కోసం పాటుపడడం ముఖ్యమని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఇండస్ మెడికేర్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు మల్లికార్జున్ పేర్కొన్నారు. మండలంలోని రామయపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఇండస్ మెడికేర్ పరిశ్రమలో వేతన ఒప్పందం జరిగిన సందర్భంగా ఆయనను కార్మికులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. అలాగే కార్మికులు పరిశ్రమ ఆవరణలో జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండస్ మెడికేర్ పరిశ్రమలో చారిత్రాత్మకమేన వేతన ఒప్పందం జరిగిందన్నారు. వీడిఏ 2.05 పైసల నుంచి 3 కు పెరుగుదల, మెడికల్ హెల్త్ ఇన్సూరెన్స్ మూడు లక్షల నుంచి 5 లక్షలకు పెరుగుదల, వీటితోపాటు అన్యువల్ ఇంక్రిమెంట్, సర్వీస్ వెయిటేజ్, ఫెస్టివల్ అలవెన్స్, పెట్రోల్ అలవెన్స్, షిఫ్ట్ అలవెన్స్,అలాగే 7 మంది పర్మనెంట్, మరొక 10 మంది కార్మికుల పర్మనెంట్ గురించి 2025-26 చర్చించడానికి యజమాన్యం అంగీకరించిందన్నారు. కనిష్టంగా రూ.10,200 ల నుంచి గరిష్టంగా రూ.15000లకు పైగా సాధించుకున్నారన్నారు. ఇలా మెరుగైన వేతన ఒప్పందాలు చేయడం సిఐటియూకే సాధ్యమన్నారు. కార్మికులు ఐక్యంగా ఉండి సీఐటీయూ గెలిపించుకొని, మెరుగైన వేదన ఒప్పందాన్ని సాధించుకున్నారన్నారు. అలాగే మెదక్ జిల్లాలో పారిశ్రామిక ప్రాంతాలలో కార్మికులచేత పరిశ్రమ యజమాన్యాలు 10 నుంచి 12 గంటలు పని చేయిస్తున్నారని, వలస కార్మికులకు వలస కార్మికుల చట్టాన్ని అమలు చేయకుండా శ్రమ దోపిడీ పరిశ్రమ యజమాన్యాలు చేస్తున్నాయన్నారు. సీఐటీయూ పోరాటాలు చేసిన చోట కనీస వేతనాలు పరిశ్రమల యజమాన్యాలు అమలు చేస్తున్నాయని, అలాగే రాబోయే కాలంలో పరిశ్రమలలో కనీస వేతనాలు అమలు చేయని చోట అమలు చేసే విధంగా పోరాటాలు నిర్వహిస్తామన్నారు. పరిశ్రమలలో లేబర్ అధికారుల పర్యవేక్షణ కరువైందన్నారు. వెంటనే కనీస వేతనాలు అమలు చేయని పరిశ్రమలపై చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. గత 10 సంవత్సరాలుగా 71 షెడ్యూల్ పరిశ్రమలలో కనీస వేతనాల జీవోలను సవరించలేదన్నారు. గతంలో కనీస వేతనాల సలహా మండలి సభ్యులుగా ఉన్నప్పుడు అనేక సార్లు కనీస వేతనాలు సవరించాలని ప్రభుత్వం దృష్టికి తీసుక వెళ్ళాను అన్ని ఆయన అన్నారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా చేసి కార్మికుల హక్కులను హరిస్తుందన్నారు.గత ప్రభుత్వం మాదిరిగానే ఇప్పుడున్న ప్రభుత్వం కార్మికుల పట్ల మొండివైఖరిని చూపుతోందన్నారు. రాబోయే కాలంలో సిఐటియు ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గంతో పాటు, కేంద్ర కార్మిక సంఘాలను ఐక్యం చేసి పోరాటాలు నిర్వహిస్తామని ఆయన అన్నారు. ఉమ్మడి జిల్లాకు ఒకరే లేబర్ అధికారి ఉండడంతో పరిశ్రమల యాజమాన్యాలు కార్మికుల పట్ల ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయన్నారు. వెంటనే మెదక్, సిద్దిపేట జిల్లాలకు జిల్లా లేబర్ అధికారిని నియమించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇండస్ మెడికేర్ ఎంప్లాయిస్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్,సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏ. మహేందర్ రెడ్డి, పరిశ్రమ ప్రధాన కార్యదర్శి బాలేష్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బస్వరాజు, జిల్లా ఉపాధ్యక్షులు ఏ. మల్లేష్, ఇండస్ మెడికేర్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు తిరుపతి, ఉపేందర్, విష్ణువర్ధన్ రెడ్డి, రమేష్, గిరి, స్వామి, సుజాత, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు

తీన్మార్ మల్లన్నపై చట్టరిత్యా చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-కౌడిపల్లి

తీన్మార్ మల్లన్నపై చట్టరీత చర్య తీసుకో వాలని కౌడిపల్లి మండల రెడ్డి సంఘం ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. గురువారం మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్లో కౌడిపల్లి మండల రెడ్డి సంఘం ఆధ్వర్యంలో రెడ్డిల పట్ల కించపరిచినట్లు మాట్లాడిన చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్న పైన కేసు నమోదు చేసి జైలుకు పంపాలని వారు డిమాండ్ చేశారు. ప్రస్తుతం రాజ్యాంగం కల్పించిన పదవిలో ఉండి ఒక కులానికి సంబంధించి అసభ్యకరంగా మాట్లాడడం సరికాదన్నారు. చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా మల్లన్నను అడ్డుకుంటామని వారు హెచ్చరించారు ప్రస్తుతం రాష్ట్రంలో అన్ని కులాలతో కలిసిమెలిసి ఉండి అందరితో కలిసిపోయే తమ కులాన్ని కించపరిస్తే సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ మహిపాల్ రెడ్డి, చిలుముల దుర్గారెడ్డి, మనోహర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, వీరారెడ్డి, భాస్కర్ రెడ్డి, కొండల్ రెడ్డి, లచ్చిరెడ్డి, మహిపాల్ రెడ్డి, పెంటా రెడ్డి, రామ్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి , జగన్ రెడ్డి, హరీష్ రెడ్డి, వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

పేదింటి ఆడపడుచుకు పుస్తె మట్టెలు అందజేత



నవతెలంగాణ-చేగుంట

మండలం ఇబ్రహీంపూర్ గ్రామం లో నిరుపేద కుటుంబానికి చెందిన బెదరమైన ఎల్లవ్వ, బాలయ్యల కూతురు ప్రమీల పెళ్లికి ప్రముఖ సంఘ సేవకులు, వాసవి క్లబ్ జోన్ చైర్మెన్ చేగుంట గ్రామానికి చెందిన అయిత పరంజ్యోతి గురువారం పుస్తె మట్టెలు, చీర అందజేసారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, అలాగే చౌదరి శ్రీనివాస్ పరంజ్యోతికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చేగుంట సొసైటీ డైరెక్టర్ అయిత రఘురాములు, వార్డ్ మెంబర్ కట్ట శ్రీనివాస్, బెదరమైన స్వామి, మఠం శ్రీశైలం, దొడ్ల రంగయ్య, బెదరమైన సురేష్, చౌదరి రఘురాములు, గడీల యాదగిరి, బెదరమైన ప్రసాద్, కుమ్మరి శ్రీకాంత్, గుండమైన నవీన్, నీల రాములు, గుర్రాల వంశీ,పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని కల్వకుంట, నందగోకుల్, గ్రామాలలోని కార్పొరేట్ ఆసుపత్రులలో శస్త్ర చికిత్సలు చేయిం చుకున్న బాధితులకు సీఎంఆర్ ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు గురు వారం అందజేశారు. దుద్దెడ రేఖకు రూ.60 వేల, నందగోకుల గ్రామానికి చెందిన డి.లింగంకు రూ.11 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంజూరు చేయించిన మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్వకుంట కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ మసూద్ అలీ మోహన్ రెడ్డి, రమేష్, కొండల్ రెడ్డి, భాస్కర్ గౌడ్, నంద గోకుల్ కాంగ్రెస్ నాయకులు అందే స్వామి, మ్యాదరి కుమార్, మ్యాథరి నరసింహులు, కొమ్మిడి భూపతిరెడ్డి, బోయిన్ బాలరాజు పాల్గొన్నారు.

తిరుమల స్వామివారికి చక్రస్నానం



నవతెలంగాణ-నిజాంపేట

తిరుమల స్వామి బ్రహ్మోత్సవా లను పురస్కరించుకొని మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో గల స్వయంభుగా వెలసిన శ్రీ తిరుమల స్వామి దేవస్థానంలో గత మూడు రోజుల నుంచి బ్రహ్మో త్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో చివరి రోజు స్వామివారికి చక్రస్నానం చేయించి దేవాలయంలోకి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాంరెడ్డి, డైరెక్టర్లు బాజా రమేష్, కాకి రాజయ్య, తుమ్మల రమేష్, ఎల్లగౌడ్‌లు ఉన్నారు.

దేవాలయాల వద్ద శాశ్వత పార్కింగ్‌కు చర్యలు

- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజు.

నవతెలంగాణ -మెదక్

ఏడుపాయల దేవాలయం పార్కింగ్ నియంత్రణ పై శాశ్వత పరిష్కారానికి పగడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో ఏడుపాయల దేవాలయం పార్కింగ్ నియంత్రణకు శాశ్వత పరిష్కారం, మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జాతర నిర్వహణకు శాఖల వారీగా కార్యచరణపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏడుపాయల వనదుర్గ అమ్మవారి దేవాలయం ఆదివారం భక్తులు తండోపతండాలుగా అమ్మవారి దర్శనానికి విచ్చేస్తారని పార్కింగ్ నియంత్రణ చాలా కష్టతరమైతున్న తరుణంలో జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి శాశ్వత పరిష్కారానికి ప్రణాళిక ఏర్పాటు చేయాలని అధికారులు ఆదేశించారు. అనంతరం రానున్న మహాశివరాత్రి సందర్భంగా ఏడుపాయల జాతర నిర్వహణ ఏర్పాట్లపై శాఖల వారీగా నిర్వహించే కార్యక్రమాలపై సమగ్ర కార్యచరణ తయారు చేసి సోమవారం లోగా సమర్పిస్తే అటువంటి నివేదికలను ప్రభుత్వానికి పంపించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డిఆర్ఓ భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రీయ విశ్వవిద్యాలయాన్ని ఎండోన్‌మెంట్ భూముల్లో నిర్మించాలి

- ఐదు ఎకరాల భూమిని ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం
- చైర్మన్ రామ్ రెడ్డి



నవతెలంగాణ-నిజాంపేట: మెదక్ జిల్లాకు కేంద్రీయ విశ్వవిద్యాలయం మంజూరి అయినందున రాష్ట్ర ప్రభుత్వం మండల పరిధిలోని చల్మెడ గ్రామ శివారులోని తిరుమల స్వామి ఆలయ సన్నిధిలోని ఎండోన్‌మెంట్ భూములలో నిర్మించాలని తిరుమల స్వామి ఆలయ కమిటీ చైర్మన్ అక్కపల్లి రాంరెడ్డి కోరారు. మండల ప్రజల కోరిక మేరకు. తిరుమల స్వామి ఆలయ ఎండోన్‌మెంట్ భూములు దాదాపు 282 ఎకరాల స్థలం ఉన్నందున, ఈ స్థలంలో కేంద్రీయ విశ్వవిద్యాలయాన్ని నిర్మించాలని కోరుతున్నామన్నారు . విద్యాపరంగా మెదక్ జిల్లా వెనుకబడిందని అందులో నిజాంపేట మండలం ఇంకా చాలా వెనుకబడి ఉన్నందున ఇక్కడ కేంద్రీయ విశ్వవిద్యాలయాన్ని నిర్మించినట్లయితే నిరుద్యోగ యువతకు ఎన్నో ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన అభిప్రాయ పడ్డారు. బాసరలో త్రిబుల్ ఐటీ నిర్మించడం వలన అక్కడ విద్యాపరంగా అభివృద్ధి చెందుతున్నారని, అదే మాదిరిగా తిరుమల స్వామి ఆలయ సన్నిధిలో కేంద్రీయ విశ్వవిద్యాలయాన్ని నిర్మించినట్లయితే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. మెదక్ నియోజకవర్గ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు స్పందించి చల్మెడ తిరుమల స్వామి ఆలయం సన్నిధిలో కేంద్రీయ విశ్వవిద్యాలయాన్ని నిర్మించాలని, 5 ఎకరాల స్థలాన్ని ఇవ్వడానికి తాము సిద్ధంగా ఉన్నామని, పాలకమండలి వర్గం కూడా సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు. ఎమ్మెల్యే రోహిత్ రావు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని విశ్వవిద్యాలయాన్ని ఇక్కడ కట్టించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రజలకు ఇబ్బందులు కలిగే నిర్మాణాలెందుకు...?

- జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేష్ యాదవ్



నవతెలంగాణ-శివ్వంపేట

గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయం చేసుకుంటూ పచ్చటి పంట పొలాలలో స్వచ్ఛమైన గాలి, నీటిని ఉపయోగించే పల్లె జనులకు ఇబ్బందులు కలిగించే ప్రభుత్వ కట్టడాలెందుకని జాతీయ మానవ హక్కుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బబ్బురి వెంకటేష్ యాదవ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం ప్యారానగర్ శివారులో హైదరాబాద్ జీఎచ్ఎంసీ అధికారులు అక్రమంగా నిర్మిస్తున్న డంపు యార్డు నిర్మాణం వల్ల పర్యావరణానికి, ప్రజలకు ఇబ్బందులు ఏర్పడే ప్రమాదముందని ఆయన మండిపడారు. డంపు యార్డు నిర్మాణాన్ని వేరే చోటుకి మారిస్తే తప్పేముందన్నారు. ఏవైనా మిగులు భూములు ఉంటే పేద ప్రజలకు పంచి పెట్టాలె తప్ప ప్రజలను అనారోగ్యం బారిన పడే కట్టడాలు ఎవరి కోసం నిర్మిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ప్యారా నగర్ పరిసరాలు ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి దేవాలయానికి అతి సమీపంలో, చుట్టూ ప్రక్కల గ్రామాలకు చేరువలో ఉండడం వల్ల ఇక్కడి పరిసరాలలో డంపింగ్ యార్డు నిర్మాణం పంట పొలాలకు, రైతులకు, గ్రామస్తులకు శ్రేయస్కరం కాదని అధికారులు గుర్తించలేదా అని ఆయన మండిపడ్డారు. ప్రజల ఆరోగ్యాలను, రైతుల బాగోగుల కోసం ప్యారా నగర్ డంపింగ్ యార్డు నిర్మాణం గురించి ప్రభుత్వం పునరాలోచించి, డంపింగ్ యార్డు నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

పేదల బడ్జెట్ కాదు కార్పొరేట్ల బడ్జెట్

- కేంద్ర బడ్జెట్ ను సవరించాలి
- ఉపాధి హామీ పథకం జాబ్ కార్డుల జారీ నిలిపివేయడం తగదు
- ప్రజా సంఘాల ఐక్యవేదిక డిమాండ్

నవతెలంగాణ-మెదక్ టౌన్ కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్లో ప్రవేశపెట్టిన యూనియన్ బడ్జెట్ లో కార్మిక, రైతు, ప్రజా సంక్షేమం కోసం నిధులు కేటాయించలేదని రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరీ అన్నారు. గురువారం మెదక్ పట్టణంలోని కేవలం కిషన్ భవనంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా రైతు సంఘం మెదక్ జిల్లా కార్యదర్శి గౌరీ మాట్లాడుతూ రైతులను కార్మికులను ప్రజలను పూర్తిగా విస్మరించే బడ్జెట్ పెట్టిందన్నారు. కార్పొరేట్లకు పెట్టుబడిదా రులకు అనుకూ లంగా బడ్జెట్ ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు ఎలాంటి నిధులు ఈ బడ్జెట్‌లో కేటాయించలేదన్నారు. తెలంగాణ నుంచి ఎనిమిది మంది ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నప్పటికీ తెలంగాణ రాష్ట్రానికి నిధులు రాబట్టడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. సంపన్నులపై పన్నులు వేయకుండా పరోక్షంగా ప్రజలపై భారం పడే విధంగా ఈ బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయన్నారు. కార్పొరే ట్లకు అనుకూలంగా ఉన్న కేంద్ర యూనియన్ బడ్జెట్‌ను సవరించేంతవరకు ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో భూమిలేని రైతులకు ఆత్మీయ భరోసా పథకం కింద 12000 ఇస్తామని చెప్పి, ఇప్పుడు ఉపాధి హామీ పథకంలో కనీసం 20 రోజులైనా పని చేసి ఉండాలని, ఉపాధి హామీ పథకానికి లింకు చేస్తుందన్నారు. ఇప్పుడు కొత్తగా దరఖాస్తు చేసుకునే వారికి జాబ్ కార్డులను బంద్ చేస్తుందన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అమలు కాగానే జాబ్ కార్డుల జారీ ఆన్లైన్లో నిలిపివేశారన్నారు. దీంతో ఉపాధి హామీ పథకంలో పనిచేసే కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఆత్మీయ భరోసా పథకం కింద సాయం చేయాల్సి వస్తుందని ప్రభుత్వం జాబ్ కార్డు ఇవ్వకుండా అడ్డుకోవడం సరికాదన్నారు. కావున ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు, కార్మికులకు, పేదలకు అనుకూలమైన విధానాలు అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోరింకల మల్లేశం, సిఐటియు మెదక్ జిల్లా కార్యదర్శి బసవరాజు, నాయకులు నరేందర్ రాములు, తదితరులు పాల్గొన్నారు.



పోలీసు అధికారులకు సిబ్బందికి వార్షిక ఫైరింగ్ పరీక్ష

నవతెలంగాణ-మెదక్



జిల్లాలో పని చేస్తున్న పోలీస్ అధికారులకు, సిబ్బందికి 3వ తేది నుండి 6 వ తేది వరకు సిద్దిపేట్ జిల్లా రాజ్ గోపాలపేట్ లో ఉన్న ఫైరింగ్ రేంజ్ నందు ఫైరింగ్ శిక్షణ ఇచ్చి ఫైరింగ్ ప్రాక్టీస్ చేయించడం జరిగిందని జిల్లా ఎస్పీ ఉదయ్ కుమారు రెడ్డి తెలిపారు శిక్షణలో భాగంగా జిల్లాలో పని చేస్తున్న సిబ్బందికి ఇచ్చే ఫైరింగ్ శిక్షణ ను జిల్లా ఎస్పీ డి. ఉదయ్ కుమార్ రెడ్డి సందర్శించి సిబ్బందికి ఇచ్చే ఫైరింగ్ శిక్షణ ను పర్యవేక్షించారు. అనంతరం ఎస్పీ ఫైరింగ్ ప్రాక్టీస్ చేశారు అందులో జిల్లా ఎస్పీ అత్యుత్తమ ప్రదర్శన కనబడుచారన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పోలీస్ అధికారులు, సిబ్బంది అందరూ అధునాతన టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవడం తో పాటుగా అన్ని రకాల ఆయుధ పరిజ్ఞానం కూడా కలిగి ఉండాలని, ఆదేశించారు. సిబ్బంది వృత్తి నైపుణ్యాన్ని మెరుగుపరిచేందుకు శిక్షణలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు.ఈ శిక్షణలో నేర్పించిన మెలకువులను శ్రద్ధతో అభ్యసించి సమయానుకూలంగా శాంతిభద్రతలు పరిరక్షణకు ఉపయోగించాలని అన్నారు. ఫైరింగ్ లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన అధికారులను సిబ్బందిని ఎస్పీ అభినదించారు. ఈ శిక్షణలో బాగంగా జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ తూప్రాన్ డీస్పీ ఎస్. వెంకట్ రెడ్డ్ మెదక్ డీస్పీ. ప్రసన్న ఎస్బి ఇన్స్పెక్టర్ సందీప్ రెడ్డి డీసీఆర్ బి ఇన్స్పెక్టర్ మధుసూదన్ గౌడ్ , మెదక్ టౌన్ ఇన్స్పెక్టర్ నాగరాజు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజ్ శేఖర్ రెడ్డి అల్లదుర్గ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రేణుక రెడ్డి సర్కిల్ ఇన్స్పెక్టర్ రంగా కృష్ణ రామాయంపేట్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకట రాజా గౌడ్, నర్సాపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జనా రెడ్డి ఆర్ ఐ శైలందర్ జిల్లాకు చెందిన ఎస్ఐ లు సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు రైతులకు అందుబాటులో ఉంచాలి

జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

నవ తెలంగాణ- కొల్చారం

నాణ్యమైన ఎరువులు, పురుగుల మందులు రైతులకు అందుబాటులో ఉంచాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. గురువారం కొల్చారం మండలంలో కలెక్టర్ విస్తృత పర్యటన చేశారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, ఎరువులు పురుగు మందుల గోడౌన్ పరిశీలను, క్షేత్రస్థాయిలో డిజిటల్ క్రాప్ బుకింగ్ తీరును వ్యవసాయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంట సర్వే జిల్లాలో పగడ్బందీగా అమలు జరుగుతుందని, పంట డిజిటల్ సర్వే ద్వారా పంటల విస్తీర్ణం, పంట దిగుబడి, పంట నష్టం, సంబంధించిన సమగ్ర వివరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. ఈ సర్వే ద్వారా పంటల ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వివరించారు. దీని కనుగుణంగా పంటలకు సంబంధించిన అవసరాలను గుర్తించవచ్చని పేర్కొన్నారు. పంటల సర్వే ద్వారా పంటల సాగుకు సంబంధించిన వివరాలను సేకరించి అంచనా వేయడంలో మండల వ్యవసాయ అధికారులు వారి పనిలో నిమగ్నమై ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వినయ్, మండల వ్యవసాయ అధికారి స్వేతాకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.



గుర్తుతెలియని వ్యక్తి శవం లభ్యం

నవతెలంగాణ-హవేలీ ఘనపూర్

అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి శవం లభ్యమైన ఘటన మండల పరిధిలోని బి.తిమ్మాయిపల్లి అటవీ ప్రాంతంలో గురువారం చోటుచేసుకుంది. హవేలీ ఘనపూర్ ఎస్సై సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం బి.తిమ్మాయిపల్లి అటవీ శాఖ బీట్ అధికారి రోజువారీగా జంతువులకు నీటిని తాగేందుకు సాసర్ ఫీట్లను పరిశీలించేందుకు వెళ్లగా అక్కడ వ్యక్తి అస్తిపంజరం కాళ్లు, చేతులు కనిపించింది. దీంతో పోలీసులకు సమాచారం అందించగా ఘటనా స్థలానికి చేరుకొని ఎస్సై సత్యనారాయణ ఆస్తిపంజరాన్ని పరిశీలించి మగ వ్యక్తి అస్తిపంజరమని గుర్తించారు. మృతునికి సంబంధించిన వివరాల కోసం హవేలి ఘనపూర్ ఎస్సై సత్యనారాయణ 871257921 సంప్రదించాలని తెలిపారు.

తప్పుల తడకగా బీసీ కులగణన

బూటకపు సర్వే

నవతెలంగాణ-తూప్రాన్



రాష్ట్రంలో నిర్వహించిన బీసీ కులగణన సర్వే రిపోర్టు పూర్తిగా బూటకపు సర్వే అని బీసీ సంక్షేమ సంఘం మెదక్ జిల్లా ఉపాధ్యక్షులు, గౌడ కల్లుగీత వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షులు చిన్నలింగ్ మల్లికార్జున్ గౌడ్ గురువారం పేర్కొన్నారు. ఈ సర్వేలో గత 2014 సమగ్ర కుటుంబ సర్వే లో 51 శాతం గా ఉన్న బీసీల సంఖ్యను ప్రస్తుత ప్రభుత్వం విడుదల చేసిన సర్వేలు 46 శాతానికి కుదిరించటం దుర్మార్గమైన చర్య అని తీవ్రంగా ఖండించారు. అగ్రకులాల సంఖ్యను రెట్టింపు చేసి బీసీ,ఎస్సీ,ఎస్టీ లా సంఖ్యను గణనీయంగా తగ్గించి చూపడం హేయమైన చర్య అన్నారు. అగ్రకులాల సంఖ్యను ఎక్కువ చూయించి రిజర్వేషన్లు బీసీలకు రాకుండా చేసే కుట్ర దాగుందని విమర్శించారు. రీ సర్వే చేసి, అప్పుడే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.

అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 8 ట్రాక్టర్లను సీజ్

తహశీల్దార్ కృష్ణ

నవతెలంగాణ-వెల్దుర్తి



మండల కేంద్రంలోని హల్దీ వాగు నుంచి అక్రమంగా గురువారం ఇసుకను తరలిస్తున్న 8 ట్రాక్టర్లను తహశీల్దార్ కృష్ణ పోలీస్ ప్రొడక్షన్‌తో పట్టుకొని సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కృష్ణ మాట్లాడారు. రాత్రి పగలు అనే తేడా లేకుండా అవసరాలకు మించి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు హస్తాలపూర్ పరిసరాల హల్దీ వాగు నుంచి మండల కేంద్ర పరిసరాల్లోని హల్దీ వాగు నుండి అక్రమం గా ఇసుకను తరలిస్తు న్నారని, ఇలాగే కొనసా గితే వేసిన పంటలకు నీళ్లు అందక బోర్లు ఎండిపోయే ప్రమా దం ఉంటుందన్నారు. అక్ర మంగా ఇసుకను తరలి స్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈయన వెంట ఆర్ఐ రమేష్ యాదవ్ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

మృతుని కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే సునీత రెడ్డి

నవతెలంగాణ-కౌడిపల్లి

మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి పరామర్శించారు. గురువారం మండల కేంద్రంలోని కౌడిపల్లిలో గత కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన మద్దెల రాములు మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం తరపున వచ్చే సహాయాన్ని అందజేసేందుకు కృషి చేస్తానని వారి కుటుంబానికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బీసా కాంతా పురుషోత్తం, పోల నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

నవతెలంగాణ-కొమురవెల్లి



భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) సిద్దిపేట జిల్లా 6వ మహాసభలను జయప్రదం చేయాలని మండల అధ్యక్ష కార్యదర్శులు తాడూరి విక్రమ్, కర్రోళ్ల నవీన్‌లు పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో ఎస్‌ఎఫ్‌ఐ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 21, 22 తేదీల్లో సిద్దిపేట పట్టణంలో జిల్లా మహాసభలు జరగనున్నాయని తెలియజేశారు. మొదటి రోజు భారీ బహిరంగ సభ ఉంటుందని ఈ సభకు విద్యార్థిని విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. భవిష్యత్ కర్తవ్యాలను, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక విద్యారంగం పూర్తిగా నిర్వీర్యమైందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యారంగ సమస్యలను రాష్ట్రప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తాడూరి విక్రం, దినేష్ భరత్ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉప కేంద్రానికి స్థలం కొరకు వినతి పత్రం

నవతెలంగాణ-మద్దూరు



మండలంలోని లద్నూర్ గ్రామంలో విద్యుత్ ఉప కేంద్రం ఏర్పాటుకు అవసరమైన ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని మద్దూరు తహసీల్దార్ ఎ.జీ.రహీంకు గ్రామ రైతుల ఆధ్వర్యంలో గురువారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని జమ్మికుంట పరిసరాల్లో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఎకరం విస్తీర్ణం విద్యుత్తు ఉప కేంద్రం ఏర్పాటుకు కేటాయించాలని కోరినట్లు వెల్లడించారు. క్షేత్రస్థాయిలో భూమి పరిశీలన చేసి త్వరలో కలెక్టర్‌కు నివేదిక పంపిస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామడుగు బాలరాజు, గ్రామ కాంగ్రెస్ నాయకులు పద్మా రెడ్డి, పులగం మల్లికార్జున్, దానియేల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో నీటి సమస్యపై పరిశీలన

నవతెలంగాణ-మద్దూరు



రానున్న వేసవికాలంలో గ్రామాల్లో నీటి సమస్యలు ఏర్పడకుండా ఉండేందుకు సమస్యలపై పరిశీలన చేసినట్లు ఆర్.డబ్ల్యూ.ఎస్.డీఈఈ కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా మండలంలో ని రేబర్తి, వల్లంపట్ల, గ్రామాల్లో సమ్మర్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో ప్రజలకు త్రాగునీటి సమస్య రాకుండా ఉండేందుకు ఏవైనా సమస్యలు ఉంటే గుర్తించేందుకు గ్రామాల్లో తిరిగినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ప్రవళిక, పంచాయతీ కార్యదర్శులు మాధవ్ జాదవ్, కిరణ్ కుమార్, తదితరులున్నారు.

నేడు విద్యుత్ సరాఫరకు అంతరాయం

నవతెలంగాణ-మర్కుక్



మండల పరిధిలోని అంగడికిష్టాపూర్‌లో గ్రామ పరిధిలో గల 132/33 కేవీ సబ్ స్టేషన్లలో పరిధిలోని మరమత్తులు కారణంగా నేడు అంగడి కిష్టాపూర్, గణేశ్ పల్లి, చేబర్తి, వర్దరాజపూర్, దామరకుంట, కర్కపట్ల, కాశిరెడ్డిపల్లి, ఎర్రవల్లి, నర్సనపేట గ్రామాల్లో విద్యుత్ సేవలు మధ్యాహ్నం 12:30 గంటల నుంచి 2:30 గంటల వరకు వరకు నిలిపి వేయబడునని మర్కుక్ విద్యుత్ ఏఈ సుధీర్ తెలిపారు. కావును రైతులు, వినియోగదారులందరూ గమనించి, సహకరించ గలరని కోరారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



నవతెలంగాణ-సిద్దిపేట

స్థానిక శ్రీ చైతన్య పాఠశాల బ్రాంచ్ వన్‌లో క్లియర్ విజన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో డాక్టర్ బాబు, జ్యోతిలు విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులు మంచి పోషకాహారాన్ని తీసుకుంటే ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తవని వారు సూచించారు. శ్రీ చైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హైమదుల్లా బేగ్ మాట్లాడుతూ సర్వేంద్రియానం నయనం ప్రధానం అని అన్నారు. కళ్ళు కనిపిస్తేనే రాయగలరు, చదవగలరని, డాక్టర్ల సలహాలు, సూచనలు తప్పక పాటించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డీన్ కరుణాకర్ రెడ్డి, సి బ్యాచ్ ఇన్చార్జి సుధాకర్, ప్రైమరీ ఇన్చార్జులు బాబు, కవిత, ప్రీ ప్రైమరీ ఇన్చార్జ్ లక్ష్మి, ఏవో రాజయ్య ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషనుకు నీటి శీతలికరణ అందజేత

నవతెలంగాణ-బెజ్జంకి



మండల పరిధిలోని తోటపల్లి ఆన్ లైన్ రిజర్వాయర్ యందు గతేడాది చేపల వేటకు వెళ్లి కాలువదాటి వెళ్లే యత్నంలో వర్షపు వరద ఉధృతికి కొట్టుకుపోయి మృతి చెందిన లక్ష్మన్ జ్ఞాపకార్థం కుమారుడు శ్రవణ్ కుమార్ పోలీస్ స్టేషనుకు నీటి శీతలికరణ యంత్రం గురువారం అందజేశారు. యంత్రాన్ని సీఐ శ్రీను ఎస్ఐ క్రిష్టారెడ్డితో కలిసి ప్రారంభించారు. శీతలికరణ యంత్రం అందజేసిన శ్రవణ్ కుమార్‌ను సీఐ శాలువ కప్పి సన్మానించారు. నాయకుడు పోచయ్య హాజరయ్యారు.

మల్క కొమరయ్యకు మా మద్దతు



నవతెలంగాణ-సిద్దిపేట

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గా బరిలో నిలుస్తున్న మల్క కొమరయ్యకు తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ యూని యన్(టీపీటీయూ) రాష్ట్ర అధ్యక్షులు మట్టపల్లి రాధా కృష్ణ, ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్‌లు తెలిపారు. గురువారం పట్టణంలో వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారానికి అసెంబ్లీలో మన సమస్యలు వినిపించాలంటే బీజేపీ అభ్యర్థి మల్కా కొమరయ్యను గెలిపించుకుంటే ఆ సమస్యల పరిష్కారానికి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో మాట్లాడతాడని అన్నారు. ఈనెల 27న జరిగే ఎన్నికల్లో ఉపాధ్యాయులు మొదటి ప్రాధాన్యత ఓటును కొమరయ్యకు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బైరి వెంకటేశం, జిల్లా ప్రధాన కార్యదర్శి సుద్దాల బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్షణ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి



నవతెలంగాణ-గజ్వేల్

వివిధ పాఠశాలలో సమస్య సేకరణ నిమి త్తం కేజీవీబీ,సింగాటం, అహ్మదిపూర్, శేరిపల్లి, కొల్గురు, పిడిచేడు, బెజుగామ పాఠశాలలను టీపీటీఫ్ గజ్వేల్ శాఖ సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా ఈ జిల్లా ఉపాధ్యక్షులు పాపగారి పాపిరెడ్డి , జిల్లా కార్యదర్శి జల్లెల శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా సమగ్ర శిక్షణ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరారు. అదేవిధంగా మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తాళ్ల నాగరాజు, గోక విద్యాసాగర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులందరికీ పాత పెన్షన్ విధానాన్ని అందరికీ అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో జిల్లా కౌన్సిలర్లు పంబాల ఎల్లయ్య, ఆకుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ-వర్గల్

ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తగా నవోదయ ప్రవేశ పరీక్షలకు పూర్తి ఏర్పాట్లు నిర్వహించినట్లు నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ రాజేందర్ తెలిపారు. శనివారం రోజున 9,11, తరగతులకు సంబంధించిన ప్రవేశ పరీక్షలను 10 పరీక్ష కేంద్రాల్లో ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్నారు. రెండు తరగతులకు గాను జిల్లావ్యాప్తంగా 2610 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పూర్తి నిర్వహణ బాధ్యత తీసుకోవాలని పరీక్ష నిర్వహణ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పరీక్షల నిర్వహణ అధికారి శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపల్ రమేష్ పాల్గొన్నారు.

మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి

- జిల్లా కలెక్టర్ ఎం.మను చౌదరి

నవతెలంగాణ-కొండపాక



సంక్షేమ గురుకుల హాస్టల్‌ల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ ఎం.మను చౌదరి పేర్కొన్నారు. కొండపాక మండలంలోని దుద్దెడ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూలు, కొండపాకలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, కొండపాకలోని వెనుకబడిన తరగతుల బాలికల హాస్టల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలల్లో భోజనం, విద్య వసతులు తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కామన్ మెనూ ప్రకారం విద్యార్థులకు అందుతున్న తీరును పరిశీలించారు. ఇంటర్ విద్యార్థులతో మాట్లాడుతూ.. వార్షిక పరీక్షల ప్రిపరేషన్ ఎలా ఉందని ఆరా తీశారు. మార్చి 6 నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ఉన్నందున వంద ఉత్తీర్ణత సాధించాలంటే ప్రతి సబ్జెక్టులో రిపీట్‌గా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. ముఖ్యంగా ఈజీగా అర్థమయ్యే సబ్జెక్టులను ప్రాక్టీస్ చేస్తూ కఠిన తరమైన సబ్జెక్టులను అర్థం చేసుకోవడంలో ఉపాధ్యాయుల సహకారం తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. పరీక్షలు మంచిగా రాసేలా స్లిప్ టెస్ట్‌లు ఎక్కువ పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. దుద్దెడ గురుకుల పాఠశాలలోని వంటగదిని హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ఆకుకూరలు అధికంగా ఉండేలా మెనూ ప్రకారం ఆహారం అందించాలని ఇన్చార్జి ప్రిన్సిపాల్ కృష్ణను ఆదేశించారు. కాలం చెల్లిన సరుకులను వాడకూడదని తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే తెలపాలని కొండపాక గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ సవితను ఆదేశించారు. తాజా సరుకులను వాడాలని చెప్పారు. బియ్యం సరిగా రాకపోతే సివిల్ సప్లై ద్వారా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం కల్పించిన కనీస అవసరాలు అన్ని గురుకులాలు, హాస్టల్లో విద్యార్థులకు లభించేలా పర్యవేక్షణ చేస్తున్నామని పేర్కొన్నారు. పదవ తరగతి పరీక్షలలో వంద శాతం ఉత్తీర్ణత పది కి పది జీపీ సాధించేలా ఫోకస్ పెట్టేలా పర్యవేక్షణ చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ దిలీప్ కుమార్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు ఆర్ఐ బాలకృష్ణమూర్తి తదితరులున్నారు.

టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుల ఎంపిక పట్ల హర్షం

నవతెలంగాణ-సిద్దిపేట



తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా సిద్దిపేట జిల్లాకు చెందిన తిరుపతి రెడ్డి నియామకం పట్ల హర్షం ప్రకటిస్తున్నట్లు టీపీటీఎఫ్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు విజేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరేందర్ తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ తిరుపతి రెడ్డి గత 30 ఏండ్ల నుంచి నిబద్ధత కలిగిన ఫెడరేషన్ కార్యకర్తగా, మూడు పర్యాయాలు ఉమ్మడి మెదక్ ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులుగా, రెండు పర్యాయాలు టీపీటీఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా, విద్యా పరిరక్షణ కమిటీ ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులుగా సంఘానికి సేవ చేశాడని తెలిపారు. ఉపాధ్యాయులుగా కొనసాగుతూ అనేక సామాజిక ఉద్యమాలలో పాల్గొన్నారని, తెలంగాణ ఉద్యమంలో తూర్పు మెదక్ జిల్లా జాయింట్ యాక్షన్ కమిటీ కో కన్వీనర్ గా తెలంగాణ ఉద్యమాన్ని ఉధృతం చేయడంలో కీలకం గా పని చేశారని అన్నారు. ఎంతోమంది నూతనగా ఉద్యోగంలో చేరిన ఉపాధ్యాయులను ఫెడరేషన్ కార్యకర్తలుగా తీర్చి దిద్దారని, ప్రస్తుతం టీపీటీఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా ఉపాధ్యాయ, సామాజిక సమస్యల సాధన కొరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే ఉపాధ్యాయ ఉద్యమాలకు వీరి అపార అనుభవం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

బీసీల అణచివేతకు ప్రభుత్వం కుట్ర

- రాష్ట్ర యువజన సంఘాల సమితి ప్రధాన కార్యదర్శి దోనె అశోక్

నవతెలంగాణ-బెజ్జంకి



అగ్రవర్ణాలను అందలం ఎక్కించి, బీసీల అణచివేతకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పూరితంగా వ్యవహరిస్తోందని తెలంగాణ యువజన సంఘాల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దోనె అశోక్ మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బీసీ కులగణనలో తీవ్ర అన్యాయం జరిగిందని ప్రభుత్వ వ్యవహరించిన తీరుపై గురువారం మండల కేంద్రంలో అశోక్ అగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో అశోక్ మాట్లాడుతూ కులగణన పేరుతో రాష్ట్ర ప్రభుత్వం వెనుకబడిన జాతుల యువకులకు నిరుద్యోగులు, యావత్ వెనుకబడిన జాతులను మోసం చేసేల కుట్రచేస్తుందని, అశాస్త్రీయంగా చేపట్టిన కులగణనను సమాజం అంగీకరించదన్నారు. మైనార్టీలను బీసీలో సమ్మెళనం చేసి ప్రభుత్వం వివరాలు వెల్లడించడం అన్యాయమేనని, బీసీ కులగణనను ప్రభుత్వం తిరిగి చేపట్టి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. బీసీ కుల సంఘాల నాయకులు ఒగ్గు సురేష్, దొడ్ల ప్రశాంత్, అడుకని వెంకటేష్, రంజిత్ గౌడ్, మాషం కొంరయ్య, దొంతరవేణి లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గుణపాఠం తప్పదు

నవతెలంగాణ -నంగునూరు



కాంగ్రెస్ ప్రభుత్వం అలవికాని హామీలతో, అబద్ధపు ప్రచారాలతో కల్లబొల్లి మాటలతో రాష్ట్ర ప్రజలు మోసపోయారని, నేడు మోసపోయి గోస పడుతున్నారని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. గురువారం నంగునూరు మండలం నర్మెట, అప్పలాయచెరువు, మైసంపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ గవర్నమెంట్ పథకాల అమలులో వైఫల్యాలను ఎండగడుతూ సిద్దిపేట మున్సిపల్ వైస్ చైర్మెన్ కనకరాజుతో కలిసి బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలతో ముఖాముఖి కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వానాకాలం ఇవ్వకుండా యాసంగి రైతు బంధును కొన్ని గ్రామాలకే ఇచ్చి, సీఎం రేవంత్ రెడ్డి తప్పుడు ప్రచారాలు చేసుకోవడం సిగ్గు చేటుగా ఉందన్నారు. కాంగ్రెస్ పథకాల అమలులో పూర్తిగా విఫలమైందని రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల సమన్వయ కర్త గుండు భూపేష్, మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు లింగం గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ ఎడ్ల సోమిరెడ్డి పీఏసీఎస్ చైర్మెన్లు కోల రమేశ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధితో పేద ప్రజలకు ఎంతో మేలు





నవతెలంగాణ-మర్కుక్

సీఎం సహాయ నిధితో పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని పాములపర్తి మాజీ సర్పంచ్ తిర్మల్ రెడ్డి, కాంగ్రెస్ మర్కుక్ మండలాధ్యక్షులు తాండ కనకయ్య గౌడ్‌లు అన్నారు. గురువారం మండల పరిధిలోని చేబర్తి గ్రామానికి చెందిన దాచిరి అశ్వినికి రూ.36 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును కాంగ్రెస్ మర్కుక్ మండల ఉపాధ్యాక్షులు ర్యాకం యాదగిరితో కలసి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం సహాయ నిధి పేద ప్రజల వరం లాటిందని, వారికి ఆర్థికంగా తోడ్పాటు అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తోట సత్తయ్య , కొండ రమేష్, ర్యాకం కనకయ్య, కొండ గాలేష్,అనిల్, అరవింద్, దేవి చంద్రం, కొండయ్య ,మహేష్,శేఖర్, తదితరులున్నారు.



నవతెలంగాణ-మర్కుక్: మండలంలోని పాములపర్తి గ్రామానికి చెందిన మీసాల రూపకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ. 13వేల చెక్కును గురువారం మర్కుక్ మాజీ ఎంపీపీ పాండు గౌడ్ వారి కుటుంబ సభ్యులకు అందజేశారు.

నవతెలంగాణ-నంగునూరు: మండలంలోని నర్మెట గ్రామానికి చెందిన కయితీ రాజుకు రూ.28,500 ల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు రావడంతో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి, గ్రామ శాఖ అధ్యక్షులు మోతెకాని కనకయ్యతో కలిసి బాధితుని చెక్కును అందజేశారు. చెక్కు మంజూరి చేసినందుకు నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చెలికాని యాదగిరి, జంగిటి శ్రీనివాస్, గోనెపల్లి శివ, దాసరి కిషన్, ఆవుల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

దహన సంస్కారాల్లో తేనె టీగల దాడి





నవతెలంగాణ-నంగునూరు : వ్యక్తి మృత దేహాన్ని దహన సంస్కారాల కోసం స్మశాన వాటికకు తరలిస్తుండగా మార్గమధ్యంలో తేనెటీగల దాడి చేసిన సంఘటన నంగునూరు మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకా రం..గురువారం మండల కేంద్రానికి చెందిన ముత్యాల రాజయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. అతని దహన సంస్కారాల కోసం స్మశాన వాటికకు వెళ్తుండగా స్మశాన వాటిక సమీపంలో తేనెటీగలు ఒక్కసారిగ వారిపై దాడి చేశాయి. ఈ దాడిలో పలువురికి తీవ్ర గాయాల య్యాయి. వారిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించ గా పలువురికి తేనెటీగలు ఎక్కువ కుట్టడంతో కాంగ్రెస్ నాయకులు దేవులపల్లి యాదగిరి సిద్దిపేట ఏరియా ఆసుపత్రిలోని వైద్యులను సంప్రదించి మెరుగైన వైద్యం కోసం సిద్దిపేట ఏరియా ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలించారు.

ఎనిమిది మంది కి తీవ్ర గాయాలు

మృతుని భార్య ఎల్లవ్వతో పాటు మరో ఏడుగురు రాకేశ్, రాజెల్లయ్య, చంద్రయ్య, భాగ్యలక్ష్మి, లింగయ్య, మంజుల, ఉప్పలవ్వ లు సిద్దిపేట ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. రాజెల్లయ్య పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు.

ఆయిల్ పామ్ పంటపై రైతులు దృష్టి సారించాలి

- దుబ్బాక ఏడీఏ మల్లయ్య

నవతెలంగాణ-దౌల్తాబాద్



రైతులు ఒకే రకమైన పంటలు కాకుండా ప్రత్యామ్నాయ పంటలైన ఆయిల్ ఫామ్ పంట సాగుపై దృష్టి సారించాలని దుబ్బాక ఏడీఏ మల్లయ్య అన్నారు.గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలోని సూరంపల్లి గ్రామంలో రైతు నరేందర్ రెడ్డి సాగు చేసిన ఆయిల్ పామ్ పంట మొదట సారిగా కోతకు రావడం జరిగిందని, మొదటి కోతలో ఎకరాకు 4 నుంచి 5 టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. ఐదు నుంచి ఆరు సంవత్సరాల తర్వాత నికరంగా ఎకరానికి 10 టన్నులు వస్తుందన్నారు. తెలంగాణ ఆయిల్ ఫెడ్ ఆధ్వర్యంలోనే మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తామని గేలలు ఫ్యాక్టరీకి సరఫరా చేసిన మూడు రోజుల్లో నగదు రైతు ఖాతాల్లో జమవుతుంది. సిద్దిపేట జిల్లాలో ఇప్పటివరకు 12 వేల ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగులో ఉందన్నారు. రైతులకు,కొత్తగా ఆయిల్ ఫామ్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులకు సబ్సిడీ ద్వారా డ్రిప్ మొక్కలను ఇవ్వడం జరుగుతుందని, పంట సాగు గురించి మెళుకువలు, సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు సంతోష్, బాపురాజు, ఆయిల్ ఫీడ్ ఫీల్డ్ ఆఫీసర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

9న శతసహస్ర సూర్య నమస్కారాల ప్రదర్శన

నవతెలంగాణ-సిద్దిపేట

సిద్దిపేట ప్రభుత్వ బాలికల పాఠశాల మినీ స్టేడియంలో ఈనెల 9న ఉదయం 6 గంటలకు శత సహస్ర సూర్య నమస్కారల ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. సిద్దిపేటలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వ్యాస మహర్షి యోగా సొసైటీ , సిద్దిపేట జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్, భారతీయ స్వాభిమాన్ ట్రస్టు ప్రతినిధులు తోట అశోక్, నిమ్మ శ్రీనివాస్ రెడ్డిలు మాట్లాడుతూ.. లక్షకు పైగా సూర్య నమస్కారాల ప్రదర్శన నిర్వహించి తద్వారా వండర్ బుక్ ఆఫ్ రికార్డు లోకి ఈ అద్భుత యోగా ప్రదర్శనను నమోదు చేయడానికి సంకల్పించినట్లు తెలిపారు. ప్రదర్శనలో పాల్గొన్న వారికి మెడల్ , సర్టిఫికెట్లను అందిస్తామన్నారు. రాష్ట్రస్థా యి సూర్య నమస్కారాలు పోటీలు కూడా జరుగుతాయని తెలిపారు. 25 ఏండ్ల లోపు, పై ఉన్న వారికి మహిళలకు , పురుషులకు వేరువేరుగా పోటీలు జరుగుతాయని తెలిపా రు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకో వాలని ప్రజల ను కోరారు. ఈ కార్యక్రమంలో విక్రమ్ రెడ్డి, చిప్ప ప్రభాకర్, స్వామి, అయిత అంజయ్య రాములు, హరిప్రసాద్, బసవ రాజ్ కుమార్, కళ్ళపల్లి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



బాధితులకు ఆర్థిక చేయూత అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-తొగుట



బాధిత కుటుంబాలను ఆర్థిక చేయూత అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం హైదరాబాదులోని తన నివాసంలో తొగుట మండలం చందాపూర్ గ్రామానికి చెందిన మదునాల శశాంక్ తండ్రి సంతో ష్ గౌడ్ కు రూ. 2.50 వేల ఎల్వోసీ చెక్కును బాధిత కుటుంబానికి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రిలీఫ్ పండ్ తో పాటు ఎల్ఓసి నిరుపేద కుటుంబాలకు చెదోడు వాదోడుగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సుప్రభాత రావు, కాంగ్రెస్ దుబ్బాక కో-ఆర్డినేటర్ విజయ్ రెడ్డి, విజయ్ పాల్ రెడ్డి, వెంగల్ రావ్, ప్రవీణ్ రజక, రాజా గౌడ్, సంద్రా శ్రీకాంత్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-మద్దూరు



అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ కుల గణన బిల్లులను ప్రవేశపెట్టి ఆమోదం తెలిపినందుకు జనగామ డీసీసీ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, ఆదేశాల మేరకు సీఎం రేవంత్ రెడ్డి, చిత్రపటానికి కాంగ్రెస్ మద్దూరు మండల అధ్యక్షుడు మేక మల్లేశం, ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా చేర్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ కామిడీ జీవన్ రెడ్డి, ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వం అని ప్రజా సంక్షేమం కోసం నిరంతరం పాటుపడే ప్రభుత్వమని తెలిపారు. అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ, కుల గణన బిల్లులను ప్రవేశపెట్టి ఆమోదం తెలిపినందుకు సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రులకు, ఎమ్మెల్యేలకు, కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు రామడుగు బాలరాజు, జిల్లా నాయకులు జక్కిరెడ్డి సుదర్శన్ రెడ్డి, బోయిని శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షుడు ముస్త్యాల మనోహర్, మహిళా అధ్యక్షురాలు గుండెగోని లలితా మల్లేశం, గ్రామ శాఖ అధ్యక్షుడు ఎఫ్ఎం షౌకత్ అలీ, నాయకులు కనక చంద్రం, పుల్లూరి రాజు, వివిధ గ్రామాల గ్రామ శాఖ అధ్యక్షులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ పెద్ది రాజుల ఉత్సవాలు ప్రారంభం

నవతెలంగాణ-తొగుట



ఘనంగా పెద్దమ్మ పెద్ది రాజుల కల్యాణోత్సవం ప్రారంభమయ్యాయని ముదిరాజ్ సంఘం సభ్యులు అన్నారు. గురువారం మండలంలోని బండారు పల్లి గ్రామంలో గణపతి పూజ ఉత్సవాలు ప్రారంభ మయ్యాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శుక్రవారం పుట్టకు దని పోయుట, పోచమ్మ బోనాలు, శనివారం పెద్దమ్మ పెద్ది రాజుల కల్యాణోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి తెలిపారు. ఈ ఉత్సవాలలో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు, బంధువులు అదిక సంఖ్య లో పాల్గొని విజయ వంతం చేయాలని కోరారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలకు ఏమీ లాభం లేదు

- మాజీ సుడా చైర్మెన్ మారెడ్డి రవీందర్ రెడ్డి

నవతెలంగాణ-సిద్దిపేటరూరల్



కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలకు ఏమి లాభం లేదని వచ్చేది బీఆర్ఎస్ పాలనని మాజీ సుడా చైర్మెన్ మారెడ్డి రవీందర్ రెడ్డి అన్నారు. గురువారం సిద్దిపేటరూరల్ మండల పరిధిలోని పుల్లూరు గ్రామంలో బీఆర్ఎస్ జండా పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఏ ఒక్క హామీ కూడా ప్రజలకు న్యాయం జరగలేదని పేరుకు మాత్రమే హామీలు గొప్పగా చెప్పి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు తిరగబడుతున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులు ప్రజలు సంతోషంగా ఉన్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఏర్ర యాదయ్య, మాజీ సర్పంచ్ పల్లె నరేష్ గౌడ్, నాయకులు రామచంద్రావు, తిరుపతి రెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు.

నామ పత్రాలు అందజేత

నవతెలంగాణ-సిద్దిపేట



హరిహర లిఖిత మహాయజ్ఞం శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ ఆధ్వర్యంలో భక్తులు లక్షకు పైగా రామ, శివ నామాలు లిఖించిన పత్రాలను నాసర్ పుర హనుమాన్ దేవాలయంలో సీతారామాంజనేయ సేవా సమితి వారు సేకరించి సంస్థ అధ్యక్షులు రామకోటి రామరాజుకి అందజేశారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు పెందోట శ్రీనివాస చారి, బోనాల శ్రీనివాస్, అయిత శ్రీకాంత్, జాప మధు, కాసోజు శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుల ఎంపిక పట్ల హర్షం

-టీపీటీఫ్ అక్బర్‌పేట్-భూంపల్లి మండల శాఖ



నవతెలంగాణ-మిరుదొడ్డి

తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా సిద్ధిపేట జిల్లాకు చెందిన జీ తిరుపతి రెడ్డి నియామకమైన సందర్భంగా టీపీటీఎఫ్ అక్బర్ పేట్-భూంపల్లి మండల శాఖ పక్షాన హర్షం వ్యక్తం చేస్తున్నామని టీపీటీఎఫ్ అక్బర్ పేట్-భూంపల్లి మండల శాఖ అధ్యక్షులు పెరుమాండ్ల శ్రీనివాస్ తెలియజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి రెడ్డి గత 30 ఏండ్ల నుంచి నిబద్ధత కలిగిన ఫెడరేషన్ కార్యకర్తగా, మూడు పర్యాయాలు ఉమ్మడి మెదక్ ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులుగా, రెండు పర్యాయాలు టీపీటీఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా, విద్యా పరిరక్షణ కమిటీ ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులుగా సంఘానికి సేవ చేశాడని తెలిపారు. ఉపాధ్యాయులుగా కొనసాగుతూ అనేక సామాజిక ఉద్యమాలలో పాల్గొన్నారని, ఎంతోమంది నూతనగా ఉద్యోగంలో చేరిన ఉపాధ్యాయులను ఫెడరేషన్ కార్యకర్తలుగా తీర్చి దిద్దారని, ప్రస్తుతం టీపీటీఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా ఉపాధ్యాయ, సామాజిక సమస్యల సాధన కొరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే ఉపాధ్యాయ ఉద్యమాలకు వీరి అపార అనుభవం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

ప్రచారంలో స్పీడ్ పెంచిన మాచర్ల



నవతెలంగాణ-సిద్దిపేట

ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్ పట్టభద్రుల స్వతంత్ర అభ్యర్థి మాచర్ల గిరిధర్ గౌడ్ ప్రచారంలో స్పీడ్ పెంచారు. గురువారం ఆయన సిద్దిపేట పట్టణంలో ప్రచారం నిర్వహించారు. వివిధ ప్రజా సంఘాల నేతలు, మేధావులు, సీనియర్ జర్నలిస్టులను కలిసి మద్దతు కోరారు. డబ్బుల సంచులతో వస్తున్నవారిని గ్రాడ్యుయేట్స్ గమనిస్తున్నారని ఎట్టి పరిస్థితుల్లో తెలంగాణలో నిరుద్యోగుల గళమై ప్రశ్నించే వారినే సమాజం ఆదరిస్తుందని స్పష్టం చేశారు. సీనియర్ పాత్రికేయుడిగా పని చేసిన తనకి గ్రాడ్యుయేట్స్ సమస్యలపై అవగాహన ఉందని కాబట్టి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా గ్రాడ్యుయేట్స్‌ని కలవడానికి వచ్చిన గిరిధర్ గౌడ్‌తో ఆయన స్నేహితులు పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కచ్చితంగా ఈ సారి జరిగే గ్రాడ్యుయేట్స్ ఎన్నికల్లో గిరిధర్ గౌడ్ గెలుపు ఖాయమని ఆయన స్నేహితులు ధీమా వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం



నవతెలంగాణ-మద్దూరు

దూళ్మిట్ట మండలంలోని కొండాపూర్, గ్రామంలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశాన్ని మండల పార్టీ అధ్యక్షుడు మంద యాదగిరి, ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జిలు అంకుల్‌గారి శశిధర్ రెడ్డి, తాడెం రజిత కృష్ణమూర్తి, పచ్చిమట్ల సిద్ధిరాములు, మాజీ జడ్పీటీసీ నాచగోని పద్మ వెంకట్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు, పాల్గొన్నారు.

మున్సిపాలిటీలోని 20 వార్డుల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయం

-కాంగ్రెస్ సీనియర్ నాయకులు మామిడి కృష్ణ



నవతెలంగాణ-గజ్వేల్

త్వరలో జరిగే మున్సిపాలిటి ఎన్నికల్లో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో 20 వార్డులు కాంగ్రెస్ హస్తగతం చేసుకోవడం ఖాయమని కాంగ్రెస్ సీనియర్ నాయకులు మామిడి కృష్ణ స్పష్టం చేశారు. గురువారం ఆయన గజ్వేల్‌లో మాట్లాడుతూ గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండాను ఎగిరేసేంతవరకు విశ్రమించమని పేర్కొ న్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజాపాలనను గడపగడపకు వెళ్లి, అన్ని వర్గాల ప్రజలకు వివరించి, ప్రజలకు కాంగ్రెస్ పార్టీని చేరువ చేసేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు కథనరంగంలోకి దూకనున్నారని ఆత్మవిశ్వాసం వెలిబుచ్చారు. మున్సిపాలిటీలో ఎన్నికలు ఎప్పుడు జరిగినా కాంగ్రెస్ పార్టీ గెలుపు తథ్యం అన్నారు.

ద్విచక్ర వాహనంపై నుంచి పడి వ్యక్తి మృతి



నవతెలంగాణ-రాయపోల్

అకస్మాత్తుగా ద్విచక్ర వాహనం బ్రేక్ వేయడంతో అదుపుతప్పి వాహనంపై కింద పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన తిమ్మక్ పల్లి గ్రామ శివారులో గురువారం చోటుచేసుకుంది. రాయపోల్ పోలీసుల కథను ప్రకారం వివరాలు..మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన పంగ మహేష్ (32) ప్రతిరోజులాగే గురువారం వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి తిరిగి వచ్చే క్రమంలో తిమ్మక్ పల్లి గ్రామ శివారులో ద్విచక్ర వాహనం అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో వాహనం అదుపుతప్పి వాహనంపై కిందపడ్డాడు. తలకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించగా చికిత్స నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం సిద్దిపేట జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిశీలించిన వైద్యులు మహేష్ మృతి చెందినట్లు ధృవీకరించారు. మృతుడి భార్య నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రాయపోల్ ఎస్సై రఘుపతి తెలిపారు.

ఇంటి నుంచి వెళ్లి..తిరిగి రాని వృద్ధుడు

-కేసు నమోదు చేసిన పోలీసులు



నవతెలంగాణ-తొగుట

ఇంటి నుంచి వెళ్లిపోయిన వృద్ధుడు తిరిగి ఇంటికి రాలేదని కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తొగుట ఎస్ఐ రవి కాంత్ రావు తెలిపారు. గురువారం ఎస్ఐ పత్రిక ప్రకటన ద్వారా తెలిపిన సమాచారం ప్రకారం మండలంలోని ఘణపూర్ గ్రామానికి చెందిన అక్కం పర్షయ్య తండ్రి నరసయ్య వృద్ధుడు (85) 5న మధ్యాహ్నం 01:00 గంటలకు ఇంట్లో నుంచి వెళ్లిపోయినాడని తెలిపారు. ఇప్పటికీ వరకు ఇంటికి తిరిగి రాలేదని, తన ఎత్తు 5.6 అంగుళాలు తన తండ్రి ఆచూకీ వెతికి పెట్టమని కొడుకు పర్శయ్య ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించామని ఎస్ఐ తెలిపారు.

డప్పులు అందజేత



నవతెలంగాణ-కొండపాక

మండల పరిధిలోని లకుడారం గ్రామానికి చెందిన దళితులకు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కందూరి అయిలయ్య డప్పులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అణగారి వర్గాలకు న్యాయం జరగాలంటే వెనుకబడిన కులాలు ఏకమై రాజ్యాధికారం చేపట్టేలా కలిసికట్టుగా ముందుకు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు అండాలమ్మ, మాజీ సర్పంచ్ మురళి, దళితులు, యువకులు తదితరులు పాల్గొన్నారు

గ్రూపు తగాదాలతో మర్చిపోయిన ప్రజా సంక్షేమం

-బీజేపీ రాష్ట్ర నాయకులు జస్వంత్ రెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్

రాష్ట్ర, నియోజకవర్గ స్థాయిలో కాంగ్రెస్ గ్రూప్ తగాదాలతో ప్రజా సంక్షేమం మర్చిపోయి కుర్చీని కాపాడుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని బీజేపీ రాష్ట్ర నాయకులు మాదాడి జస్వంత్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో అయోమయం నిలబండదని దీంతో రాష్ట్రంలో ప్రజా సంక్షేమం కుంటుపడుతుందన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలను అయోమయానికి గురిచేస్తుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీ జే పీ తన బలాన్ని చాటుకుంటుందని ఆయన చెప్పారు. గజ్వేల్లో అనేక పెండింగ్ పనులు ఉన్నాయని వాటిని పూర్తి చేయవలసిన బాధ్యత కేసీఆర్‌పై ఉందన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు దేవేందర్రావు, ఐల మహేందర్, రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం..

-కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-దౌల్తాబాద్

కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు వారి కుటుంబాలకు కష్టసుఖాల్లో అండగా ఉంటామని దుబ్బాక నియోజకవర్గ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురు వారం మండలంలోని మహ్మద్ షాపూర్ గ్రామంలో ఇటీవల మరణించిన బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత మాజీమంత్రి ఎమ్మెల్యే ముత్యం రెడ్డి అడుగుజాడల్లో నడిచిన వ్యక్తి మాజీ ఎంపీటీసీ, సర్పంచిగా పోటీ చేసిన వ్యక్తి బూదయ్య అని కొనియాడారు. ఆయన సతీమణి మరణం వారి కుటుంబానికి తీరని లోటని గుర్తు చేశారు. కేశవగారి నారాయణ మృతి వారి కుటుంబ సభ్యులకు తీరని లోటన్నారు. ఇరువురి కుటుంబాలకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు పడాల రాములు, ఎస్సి సెల్ మండల అధ్యక్షులు బండారు లాలు, మండల ఉపాధ్యక్షులు మద్దెల స్వామి, మండల ప్రధాన కార్యదర్శి మల్లారెడ్డి, పాల్గొన్నారు.



పంటలు ఎండిపోతున్న..
నీళ్లు విడుదల చేయరా..?



- కొండపోచమ్మ కాలువల ద్వారా నీళ్లు అందించాలి
- సాగునీటి కోసం రోడ్డుపై ధర్నా చేసిన రైతులు

నవతెలంగాణ-దౌల్తాబాద్

యాసంగి కాలంలో వేసిన వరి పంటలు ఎండిపోతున్నాయని అయినా గాని ప్రభుత్వం నిమ్మకు నీరు వచ్చినట్లు కొండపోచమ్మ, మల్లన్న సాగర్ ప్రాజెక్టు కాలువ ద్వారా వ్యవసాయ పంటలకు నీళ్లు అందించడం లేదని ఆగ్రహం చెంది రైతులు మండలంలోని హైమద్ నగర్ గ్రామం వద్ద గజ్వేల్ రామాయంపేట రోడ్డుపై ధర్నా గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గ్రామాల్లో పంటలు, చెరువులు ఎండిపోతున్నాయని ముబారస్‌పూర్, మల్లేశం పల్లి, హైమద్ నగర్ గ్రామాల రైతులు ఉప్పరపల్లి కెనాల్ వద్ద ధర్నా నిర్వహించారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, మెదక్ ఎంపీ రఘునందన్ రావు ,కాంగ్రెస్ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి డౌన్ డౌన్ అంటూ నిదానాలు చేస్తూ రైతులు రోడ్డుపై బైటాయించి చెరువులు నింపాలని డిమాండ్ చేశారు. సాగుచేసిన పంటలు కళ్ళేదుటే ఎండిపోతున్నాయని వారు స్పందించి కొండపోచమ్మ ద్వారా ఉప్పరపల్లి కెనాల్ కాల్వ ద్వారా చెరువులు నింపి పంటలకు నీరు అందించాలన్నారు. ధర్నా చేస్తున్న రైతులతో దౌల్తాబాద్ ఎస్సై శ్రీరామ్ ప్రేమ్ దీప్ నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడి రెండు, మూడు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని భరోసా కల్పించడంతో రైతులు ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో గ్రామాల రైతులు పాల్గొన్నారు.



నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సందబోయిన ఎల్లయ్య



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ నియోజకవర్గంలోని జగదేవ్పూర్, మర్కుకు మండలాల్లో తాగడానికి, గృహ అవసరాలకు నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని సీపీఐ (ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సందబోయినఎల్లయ్య ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. గురు వారం ఆయన మాట్లాడుతూ గత రెండు నెలలుగా మిషన్ భగీరథ నీటిని గ్రామంలో ప్రజలందరికీ అవసరానికి సరిపడా సరఫరా చేయడం లేదన్నారు. మర్కుకు మండలం దామరకుంట, కాశిరెడ్డిపల్లి వరదరాజపురం, కర్కపట్ల, జగదేవ్పూర్ మండలం ఇటిక్యాల కొత్తపల్లి, చాట్లపల్లి, వట్టిపల్లి పలుగడ్డ మాందాపూర్, కొండాపూర్ తదితర గ్రామాలకు నీటిని సరఫరా చేయకుం డా ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నార న్నారు. నియోజకవర్గంలోని కొండపోచమ్మ, మల్లన్న సాగర్ ప్రాజెక్టులో పుష్కలంగా మీరు ఉండగా గ్రామాలకు నీటి సరఫరాలో ఇబ్బందులు ఏమిటని ప్రశ్నిం చారు. నియోజక వర్గంలోని అనేక గ్రామాలు పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధి జరిగిన కొద్దీ గ్రామాల్లో పట్టణ వాతావరణం పెరిగిం దని, ప్రజలు రోజువారి తాగడానికి, గృహ అవసరాలకు అవసరపడే విధంగా నీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో ప్రజలను సమీకరించి ఖాళీ బిందెలతో ఆర్డీవో కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు.

ఆర్థిక ఇబ్బందులతో దళిత యువ రైతు ఆత్మహత్య



నవతెలంగాణ-గజ్వేల్

ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ ఉన్నకొద్ది భూమిలో పంటసరిగా రాక తెచ్చిన అప్పులు పెరిగిపోయి. ఇచ్చిన వారికి ఎమిచెప్పాలో తెలియక రోజు మనసులో కూమిలిపోతూ బుధవారం రాత్రి 11 గంటల సమయంలో తన వ్యవసాయ భూమివద్ద చెట్టుకు ఊరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటన గజ్వేల్ మండల్ అనంతరావుపల్లిలో జరిగింది. మృతుడు దార నాగరాజు(38)కు ఇద్దరు కొడుకులు పవణ్ కల్యాణ్ (15), రాజు(12), భార్య రాజమణి (34)తో పాటు వృద్ధ తల్లి పెంటవ్వ(75) ఉన్నారు. తనకున్న 30 గుంటల వ్యవసాయ భూమిలో పంటవేయటం వలన అప్పులు అధికమైతే సగం భూమిని అమ్మిన అప్పులు తీరే పరిస్థితి కానరాకపోవడంతో ఉన్న ఇద్దరు పిల్లల చదువులు ఎట్లా అనుకుంటూ ఇళ్లులేకపోతే ఈ మధ్యనే కొత్త ఇళ్ళు నిర్మించుకున్నారు. ఈ అప్పు ఉన్నాప్పుకు మరింతతోడై అప్పు అధికం కావడంతో తట్టుకోలేక తన వ్యవసాయ భూమి వద్ద చెట్టుకు ఊరేసుకొని తనవుచాలించారు.

పదో తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలి

- వరంగల్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ సత్యనారాయణ రెడ్డి



నవతెలంగాణ-రాయపోల్

రాయపోల్ మండల పరిధిలోని పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు విద్యార్థులు కలిసికట్టుగా కృషి చేయాలని వరంగల్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ సత్యనారాయణ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కేజీబీవీ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ చేపట్టారు. పాఠశాలల రికార్డులన్నిటినీ పరిశీలించి సంతృప్తి వ్యక్తపరిచారు. పిల్లల విద్యాభివృద్ధికై ఉపాధ్యాయులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడ ుతూ.. విద్యార్థులు సమయపాలన పాటిస్తూ ఉపాధ్యాయులు బోధించిన అంశాలు సక్రమంగా నేర్చుకొని అందరూ ఉత్తమ మార్కులు సాధించాలన్నారు. అనంతరం డీఈఓ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని తెలియజేశారు. అనంతరం వారు పదవ తరగతి ప్రత్యేక తరగతులను పరిశీలించి విద్యార్థుల స్నాక్స్ గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సత్యనారాయణరెడ్డి, ప్రధానోపాధ్యాయులు నాగరాజు, కేజీబీవీ ఎస్ఓ సుగంధ లత, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

ప్రజా జర్నలిస్ట్ 'ఆర్.సత్యనారయణ'

- ప్రజా సంఘాలు, జర్నలిస్టులు నివాళులు

నవతెలంగాణ-సిద్దిపేట

ఆర్.సత్యనారాయణ మాకొ ధైర్యం, జర్నలిస్టుగా, రాజకీయ నాయకుడిగా మరింత ఉన్నత స్థాయికి ఎదగక ముందే అధికారాన్ని పదవులను అనుభవించకుండానే అన్నిటిని త్యాగం చేసాడని పలువురు జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలు అన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఆర్.సత్యనారాయణ సంతాప సభ గురువారం సాయంత్రం సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో ఆర్ఎస్ఎన్ మిత్రులు, సామాజిక ప్రజా సంఘాల అధ్వర్యంలో పొచబోయిన శ్రీహరి యాదవ్ అధ్యక్షతన జరిగింది. సినియర్ జర్నలిస్టు అంజయ్య మాట్లాడుతూ.. ఆర్.సత్యనారాయణ వివిధ రంగాల్లో ప్రతిభ కనపర్చిన జర్నలిస్టు అని కొనియాడారు. అకాలం లో పోలీసులు, నక్సలైట్ ల మధ్య ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొన్నాడన్నారు. నాటి వ్యాపార వేత్తలు నేటి కార్పొరేట్ ల కథలను ప్రజలకు అందించాడన్నారు. సినియర్ జర్నలిస్టు తోట అశోక్ మాట్లాడుతూ.. జర్నలిస్టులు ప్రజా వార్తలు రాసేటప్పుడు మాకు ఒక ధైర్యమన్నారు. ఫొకస్ పేరుతో అనేక కథనాలను రాశాడన్నారు. నక్సలైట్‌ల అరెస్టుల వార్తలను రాత్రి సమయంలో సైతం వార్త వేసి అనేక మంది ప్రాణాలను కాపాడన్నారు. జర్నలిస్టు సంఘం జిల్లా అధ్యక్షుడు రంగాచారి మాట్లాడుతూ.. సమాజంలో దారి వేస్తు సత్యనారాయణ స్ఫూర్తితో నింపాడన్నారు. జర్నలిస్టులపై పోలీసులు నిర్భంధాలను దిక్కరిస్తు జర్నలిస్టుల మరణ వాంగ్మూలాన్ని ప్రపంచానికి చాటడన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి వై.అశోక్ కుమార్ మాట్లాడుతూ.. ప్రజల పక్షనా ప్రజల కోణంలో సత్యనారాయణ అనేక వార్తలు రాశాడన్నారు. ప్రాంతీయ అసమానతలను ప్రశ్నించాడన్నారు. తెలంగాణ ఉద్యమం లో ఎమ్మెల్సీగా గెలిచి ఒక సంవత్సరానికి రాజీనామ చేశాడన్నారు. తెలంగాణ ఉద్యమం లో ఎత్తుగడలతో పని చేశాడన్నారు. రాజకీయాలలో నిరాశకు గురయ్యడని, వెలి వెశారన్నారు. ఈ సంతాప సభలో జెఎసి నేత పాపయ్య, జర్నలిస్ట్ నేత రాజిరెడ్డి, మరసం జిల్లా అధ్యక్షుడు సిద్ధంకి యాదగిరి, డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, టీఎన్జీవో స్ జిల్లా ప్రధాన కార్యదర్శి విక్రమ్ రెడ్డి, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్, భీమ సేన, మెట్ల శంకర్, దుబాషి సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.



ఇంటి నెంబర్లను తీసుకోవాలి

-అక్రమ నిర్వహణపై చర్యలు
-మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య

నవతెలంగాణ-గజ్వేల్

కమర్షియల్ వ్యాపారులు మున్సిపల్ ఇంటి నెంబర్లు తీసుకోవాలని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య అన్నారు. గురువారం షెడ్లు, పెట్రోల్ బంకులు, ఇతర నిర్వాణ కోసం నిర్మించుకున్న గోదాములకు ఇంటి నెంబర్ లేకుండా ఉన్నాయని వాటిని గుర్తించినట్లు తెలిపారు. పది రోజుల్లో ఇంటి నెంబర్ తీసుకోకపోతే 2019 మున్సిపల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా ఇంటి పన్ను కలెక్షన్‌తో పాటు కమర్షియల్ వ్యాపారులు సముదాయాలను పరిశీలించి ట్రేడ్ లైసెన్స్, షాప్ యజమానులు లైసెన్స్ తీసుకోవాలని సూచించారు. రెడ్ లైసెన్స్ పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి ప్రజలందరూ సహకరించాలని కోరారు. అదేవిధంగా గజ్వేల్ పట్టణంలో అండర్ డ్రైనేజీ సమస్య పరిశీలించి శుభ్రం చేయించినట్లు ఆయన తెలిపారు. అండర్ డ్రైనేజీలో డైపర్స్, ప్యాడ్స్, షాంపూ ప్యాకెట్లు అండర్ డ్రైనేజీలు వేయడం వల్ల జామ్ అవుతున్నాయని గుర్తించినట్లు చెప్పారు. ఈ విషయంలో ప్రజలు చెత్తబుట్టల వేయాలని రోడ్డు, డ్రైనేజీ, డోర్ టు డోర్ కలెక్షన్ పై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



గోవర్ధనగిరి బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

- సీపీఐ మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి



నవతెలంగాణ-అక్కన్నపేట

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనిలో భాగంగా అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి గ్రామంలో ఇటీవల తల్లి, కూతురు మరణించిన సంఘటన చాలా బాధాకరమని సీపీఐ మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. గురువారం గోవర్ధనగిరి గ్రామంలో మృతుల కుటుంబాలను, ప్రమాద బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు రూ. 25లక్షలు, ప్రమాద బాధితులకు రూ.15లక్షలు ప్రభుత్వం సాయం అందించాలన్నారు. అంతేకాకుండా అర్హులైన వారికి స్థాయిలో ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలన్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కొమ్ముల భాస్కర్, హుస్నాబాద్ మండల కార్యదర్శి గడిపే మల్లేష్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జాగిరి సత్యనారాయణ, ఏడల వనేష్, కౌన్సిల్ సభ్యులు కొయ్యడ కొమురయ్య, ఎగ్గొజు సుదర్శనచారి, గ్రామ కార్యదర్శి పర్శరాములు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు ప్రభుత్వాలు పెద్దపీట

- ఏకాగ్రతతో విద్యను అభ్యసించాలి
- చేర్యాల సీఐ ఎల్.శ్రీను



నవతెలంగాణ-చేర్యాల

మహిళా సాధికారతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దపీట వేస్తున్నాయని చేర్యాల సీఐ ఎల్.శ్రీను అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ స్కూల్ విద్యార్థినిలకు మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, సైబర్ నేరాలు, గుడ్ టచ్ బాడ్ టచ్, గంజాయి, సీసీ కెమెరాలు, ఈవిటీజింగ్, నూతన చట్టాల గూర్చి గురువారం సీఐ, హుస్నాబాద్ షీ టీం బృందం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీను మాట్లాడుతూ చదువుకునే సమయంలో ఎలాంటి చెడు ఆలోచనలకు తావియ్యకూడదని, ఏకాగ్రతతో విద్యను అభ్యసించాలని తెలిపారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తుంచు కొని ఇష్టపడి చదువుకోవాలని, చదువు ఉంటే జీవితంలో ఏదైనా సాధించవచ్చున్నారు. సైబర్ నేరాలు పట్ల అప్రమ త్తంగా ఉండాలని,గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే ఎలాంటి వివరాలు తెలుపవద్దన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ కృష్ణవేణి, ఉపాధ్యాయులు, హుస్నాబాద్ షీటీమ్ బృందం సదయ్య , హెడ్ కానిస్టేబుల్, మహిళ కానిస్టేబుల్ ప్రశాంతి, కానిస్టేబుల్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-మద్దూరు

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యను సద్వినియోగం చేసుకోవాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అధ్యాపకులు శ్రీనివాస్ కోరారు. ఈ సందర్భంగా మండలంలోని రేబర్తి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వ కళాశాల బోధనపై విద్యార్థులకు కళాశాల అధ్యాపక బృందం అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల కళాశాలల ఔన్నత్యాన్ని, గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాల కళాశాలలో చదువుకున్నటువంటి విద్యార్థులు మెరుగగా ఉంటారని అన్ని రంగాల్లో బాగా రాణిస్తారని తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వ విద్యను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు చంద్రబాను, అధ్యాపకులు మాలు, శ్రీనివాస్, ఉపాధ్యాయులు శిరీష, సంపత్, చంద్రారెడ్డి, రవి, మల్లేశం, నర్సింలు, శ్రీనివాస్ రెడ్డి, ప్రశాంత్ ,కవిత ,తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి



నవతెలంగాణ-మద్దూరు: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ప్రజలకు మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించిందని స్థానిక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పాలని మద్దూరు మాజీ ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి, అన్నారు. గురువారం మద్దూరు మండలంలోని నర్సాయ పల్లి, గ్రామంలో ఎన్నికల సన్నహక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని అన్నారు. స్థానిక సంస్థ ల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్‌లు ముస్త్యాల నాగేశ్వరరావు, ఇన్నారెడ్డి, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు తవిటీ యాదగిరి, నాయకులు మంతెన బాల్ రెడ్డి, తవిటి రాములు, గొల్లిపల్లి నర్సిరెడ్డి, ముస్త్యాల శ్రీనివాస్, చల్ల మహేందర్రెడ్డి, మంతెన భరత్ రెడ్డి, పాల్గొన్నారు.

ఇంటి రుణం తీర్చలేక వ్యక్తి ఆత్మహత్య



నవతెలంగాణ-దౌల్తాబాద్

ఇంటి కోసం ప్రయివేట్ బ్యాంకులో తీసుకున్న రుణం తీర్చలేక తీవ్ర మనస్తాపం చెంది వ్యక్తి మృతి చెందిన సంఘటన దౌల్తాబాద్ మండలం కోనాపూర్ గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. దౌల్తాబాద్ పోలీసుల కథనం ప్రకారం వివరాలు..దౌల్తాబాద్ మండల కేంద్రానికి చెందిన తుమ్మల సత్యనారాయణ (41) గొల్ల కురుమ వృత్తితో పాటు హమాలీ పని చేస్తూ మూడేండ్ల క్రితం ఐఐఎఫ్ఎల్ ప్రయివేట్ ఫైనాన్స్ సిద్దిపేట బ్యాంకు నుంచి రూ.16 లక్షల ఇంటి రుణం తీసుకున్నారు. ఈ ఋుణం ప్రతి నెల రూ.22 వేల వాయిదా చొప్పున చెల్లించాలి. అయితే గత కొద్ది నెలల నుంచి నెలవారి ఈఎంఐ చెల్లించడం లేదు. దీనితో బ్యాంకు వారు ఆయన ఇంటికి వచ్చి ఈ ఇల్లు ఐఐఎఫ్ఎల్ ప్రైవేట్ ఫైనాన్స్ బ్యాంకుకు చెందినదని ఇంటి గోడకు రాసి వెళ్లారు. అప్పుల విషయంలో భార్యాభర్తలకు బుధవారం రాత్రి గొడవ జరిగింది. దానితో ఇంటి అప్పు తీర్చే మార్గం కనబడక సత్యనారాయణ తీవ్ర మనస్థాపానికి గురై, జీవితంపై విరక్తి చెంది ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించ డంతో, వారు వెళ్లి చూసేసరికి సత్యనారాయణ మృతి చెందాడు. పోలీసులకు సమాచారం ఇచ్చి, మృతదేహాన్ని పోస్టుమార్టం కొరకు ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య రేణుక కుమారులు జశ్వంత్, అజయ్ ఉన్నారు. రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు దౌల్తాబాద్ ఎస్సై శ్రీరామ్ ప్రేమ్ దీప్ తెలిపారు